# చికెన్ @ రూ. 260

## భారీగా పెరిగిన చికెన్ ధరలు



హైదరాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : చికెన్ ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. మొన్నటి వరకు కిలో చికెన్ రూ.220 ఉండగా, ఆదివారం రూ.40 పెరిగి రూ.260కి విక్రయించారు. దీంతో చాలా మంది చికెన్ కొనుగోలు చేసేందుకు సంకోచించారు. ఇటీవల చికెన్ అమ్మకాలు పడిపోవడంతో ధరలు తగ్గించిన వ్యాపారులు మిగతా సిటీ 3వ పేజీలో

అనారోగ్యంతో కార్మికురాలు ఆత్మహత్య.. 2లో

భార్యతో గొడవ పడి భర్త బలవన్మరణం.. 2లో

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి.. 3లో

హైదరాబాద్ వార్త



# ఫ్యాన్.. ఏసీ ఆన్

ఒక్కసారిగా విద్యుత్ వినియోగం పెరగడంతో సబ్‌స్టేషన్లలోని ఫీడర్లు ఒత్తిడికి గురవుతున్నాయి. అయిల్ లీకేజీలను సరి చేయకపోవడంతో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఒత్తిడి తట్టుకోలేక పేలిపోయే అవకాశాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉక్కపోత
- గ్రేటర్‌లో భారీగా విద్యుత్ వినియోగం
- హీటెక్కుతున్న పవర్ ట్రాన్స్ ఫార్మర్లు



హైదరాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : భానుడి ప్రతాపం అప్పుడే మొదలైంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు విద్యుత్ శాఖకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. సాధారణంగా శివరాత్రి తర్వాత ఎండల తాకికి పెరుగుతుంది. ఈసారి మాత్రం ముందుగానే ఎండలు మండుతుండటంతో గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్ డిమాండ్ పెరిగింది. ఉదయం 10 గంటల తర్వాత సూర్యుడు సుర్రుమంటున్నాడు. మధ్యాహ్నం పూట బయటికి రావాలంటేనే నగరవాసులు కాస్త ఆలోచిస్తున్నారు. ఆదివారం గరిష్టంగా 37.4 సెల్సియస్ డిగ్రీలు, కనిష్టంగా 18.8 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భగ్గున మండుతున్న ఎండలకు ఉక్కపోత తోడవడంతో ఉపశమనం కోసం సిటీజన్లు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వినియోగిస్తున్నారు.

- వేసవి ప్రారంభానికి ముందే లైన్ల పునరుద్ధరణ, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, డీటీఆర్‌లలో అయిల్ లీకేజీల నియంత్రణ, ఎర్తింగ్ ఏర్పాటు, లూజు లైన్లను సరి చేయడం వంటి పనులు పూర్తి చేయాల్సి ఉన్నా..అధికారులు ఇప్పటి వరకు వాటిపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టకపోవడం ఆందోళన కలిగిస్తోంది.
- వాతావరణంలో ఒక్కసారిగా చోటు చేసుకున్న ఈ మార్పులను శరీరం తట్టుకోలేక పోతోంది. నిజానికి చలి కారణంగా నిన్న మొన్నటి వరకు ఫ్యాన్లు పెద్దగా వాడలేదు. ప్రస్తుతం ఉక్కపోత ప్రారంభం కావడంతో ఏకంగా ఏసీలను ఆన్ చేస్తున్నారు. కేవలం గృహ విద్యుత్ మాత్రమే కాకుండా వాణిజ్య వినియోగం భారీగా నమోదవుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు పూర్తి స్థాయిలో పని చేస్తుండటమే ఇందుకు కారణం.
- ఫిబ్రవరి మొదటి వారంలో నగరంలో రోజు సగటున విద్యుత్ డిమాండ్ 52 మిలియన్ యూనిట్లు ఉండగా, ప్రస్తుతం 57 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. రెండో శనివారం విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. వర్కింగ్ డేస్‌తో పోలిస్తే..సెలవు దినాల్లో వినయోగం కొంత తగ్గాల్సి ఉంది. కానీ ఇందుకు విరుద్ధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. మార్చి చివరి నాటికి 75 నుంచి 80 ఎంయూలకు చేరుకునే అవకాశం ఉన్నట్లు డిస్కం అధికారులు అంచనగా వేశారు.

# చాక్లెట్‌లో బతికున్న పురుగు

## అమీర్‌పేటలో ఘటన

చాక్లెట్‌ని ఎవరు ఇష్టపడదరు..చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ వీటిని తింటారు. మనం ఇష్టపడి తినే చాక్లెట్లు కూడా దీర్ఘకాలంలో మనల్ని అనారోగ్యానికి గురిచేస్తాయని నిపుణులు హెచ్చరించిన విషయాన్ని విస్మరించవద్దు. అయితే ఈ చాక్లెట్ కొనుగోలు చేసిన వినియోగదారుడికి చేదు అనుభవం మిగిల్చింది.

హైదరాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : చిన్నారుల కోసం కొనుగోలు చేసిన చాక్లెట్‌లో సజీవ పురుగు కనిపించింది. దీంతో షాక్‌కు గురైన వినియోగదారుడు కదులుతున్న పురుగును వీడియో తీసి ట్విట్టర్‌లో ఎక్స్ లో పోస్ట్ చేశాడు. నగరంలోని అమీర్‌పేటలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నగరంలోని ఓ సూపర్‌మార్కెట్‌లో కొనుగోలు చేసిన డైరీ మిల్క్ చాక్లెట్‌లో సజీవ పురుగు కనిపించింది. చిన్న పురుగు కూడా చాక్లెట్ రంగులోకి మారి తిరుగుతోంది. దీనికి సంబంధించిన వీడియోను సామాజిక కార్యకర్త రాబిన్‌జూచ్యూస్ 'ఎక్స్' ద్వారా షేర్ చేశాడు. అమీర్‌పేటలోని ఒక సూపర్‌మార్కెట్‌లో కొనుగోలు చేశానని, దానికి సంబంధించిన బిల్లులను కూడా జత చేశానని చెప్పారు. డెయిరీ మిల్క్ చాక్లెట్‌లో పురుగులు ఉండటంపై క్యాడ్‌బరీ సూపర్‌మార్కెట్ నిర్వాహకులను ప్రశ్నించింది. ఈ గడువు ముగిసిన ఉత్పత్తులకు నాణ్యత తనిఖీ ఉందా? ప్రజారోగ్య ప్రమాదాలకు ఎవరు బాధ్యత వహిస్తారు? అన్నాడు రాబిన్. అతను జిహెచ్‌ఎంసి, చాక్లెట్ తయారీ సంస్థ, కొనుగోలు చేసిన సూపర్‌మార్కెట్‌ను తన కొనుగోలు బిల్లు ఫొటోను షేర్ చేశారు. అయితే దీనిపై చాక్లెట్ సంస్థ స్పందించింది. హాయ్, మా సంస్థ అత్యధిక నాణ్యతా ప్రమాణాలు నిర్వహించడానికి ప్రయత్నిస్తుంది. మీ చేదు అనుభవానికి మమ్మల్ని క్షమించింది. మీ ఫిర్యాదును పరిష్కరించడానికి దయచేసి మీ పూర్తి పేరు, చిరునామా, ఫోన్ నంబర్, కొనుగోలు వివరాలను అందించండి. మీ ఫిర్యాదుపై చర్య తీసుకోవడానికి మాకు ఈ వివరాలు అవసరం అని స్పష్టగా చెయబడింది. కాగా, చాక్లెట్‌లో పురుగుల ఘటనపై జిహెచ్‌ఎంసి కూడా స్పందించింది. ఈ ఘటనపై సంబంధిత ఫుడ్ సేఫ్టీ టీమ్‌కు ఫిర్యాదు చేశామని, వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు.

మణికొండలో అవిశ్వాసంను నెగ్గించుకుంటాం

14మంది సభ్యులు అవిశ్వాసానికి మద్దతు బిఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి - 3లో

వామపక్షాల ఐక్యతతో మతోన్మాద బిజెపిని ఓడించగలం ఎంఎల్‌పిఐ (రెడ్‌ఫ్లాగ్) ..3లో

## మోటార్ సైకిల్ అదుపుతప్పి.. వాహనదారుడు మృతి



మృతిచెందిన కామేశ్వరరావు

కొంపల్లి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త : మోటార్ సైకిల్ అదుపు తప్పడంతో వాహన చోదకుడు మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయి నగర్‌లో నివసించే కామేశ్వరరావు (53) శనివారం రాత్రి ఇంటి నుంచి బాచుపల్లి గండి మైసమ్మ ప్రధాన రహదారిలో ఉన్న దర్గా వద్దకు వెళ్ళి తిరిగి వస్తుండగా అకస్మాత్తుగా తాను నడుపుతున్న మోటార్ సైకిల్ అదుపుతప్పి సమీపంలోని కాంపౌండ్ వాల్‌కు బలంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో మృతుడి తలకు ఎడమవైపున బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే కామేశ్వరరావు మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహానిన పోస్టుమార్టు నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

# పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన

## వారాంతపు సెలవుతో కిక్కిరిసిన బుక్‌ఫెయిర్



ముషీరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: ఎన్టీఆర్ స్టేడియం (తెలంగాణ కళా భారతి)లో కొనసాగుతున్న 36వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనకు పుస్తక ప్రియుల నుండి విశేష స్పందన వస్తోంది. ఆదివారం వారాంతపు సెలవు కావటంతో మధ్యాహ్నం ఒంటి గంట నుండే సందర్శకులు టిక్కెట్లు తీసుకునేందుకు బారులు తీరారు. ఇంటర్‌నెట్ కాలంలో కూడా పుస్తకానికి ప్రాధాన్యత ఇంకా ఇంకా పెరుగుతోందే తప్ప ఎంత మాత్రం తగ్గటంలేదు అనటానికి నిదర్శనం ఈ పుస్తక ప్రదర్శనే అనటంలో ఎటువంటి సందేహం లేదు. మహానుభావులు చెప్పినట్లు పుస్తకం లేనిదే మనిషి మనుగడ లేదని, మొబైల్ ఫోన్, కంప్యూటర్ వంటి విజ్ఞాన పరికరాలు ఎన్ని వచ్చినా పుస్తకం విలువ రోజు రోజుకూ పెరుగుతూనే ఉంటుందనేది అక్షర సత్యం.



**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు:** ఆదివారం బుక్‌ఫెయిర్‌లోని రవ్వా శ్రీహరి వేదికపై నిర్వహించిన దివ్యారెడ్డి డ్యాన్స్ అకాడమీ మరియు భాగ్యలక్ష్మి డ్యాన్స్‌స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన, చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్‌షో సందర్శకులను విశేషంగా అలరించాయి. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్.వాసు, ఉపాధ్యక్షులు కోయా చంద్రమోహన్, సాహితీవేత్త చొక్కాపు వెంకట రమణల చేతుల మీదగా సర్టిఫికెట్లు అందచేశారు.

**పుస్తకావిష్కరణలు:** ఆదివారం పుస్తక ప్రదర్శనలో పలు పుస్తకాలను ఆవిష్కరించారు. మొదటగా అదిలాబాద్ జిల్లా రూరల్ మండలం, యాపల్‌గుడా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు ఇంగ్లీషులో రాసిన కథల పుస్తకం ద స్టోరీస్ ఆఫన యాపల్ గుడా చిల్డ్రన్ అనే పుస్తకాన్ని బాల సాహితీవేత్తలు వి.ఆర్.శర్మ, చొక్కాపు వెంకటరమణ, కోయా చంద్రమోహన్, రమాశాండిల్యాల చేతుల మీదగా ఆవిష్కరించారు. అనంతరం పూర్ణిమ తమ్మిరెడ్డి తెలుగులోకి అనువదించిన పంజరం అమృతాప్రీతమ్ పుస్తకాన్ని చిన వీర భద్రుడు ఆవిష్కరించగా, డాక్టర్ జతిన్ కుమార్ పుస్తకం గురించి విశ్లేషించారు. అనం తరం పి.శ్రీనివాస్ గౌడ్ రచించిన మార్జినోళ్ల కథల పుస్తకాన్ని ప్రముఖ కవి, ఐఆర్‌ఎస్ అధికారి డాక్టర్ జెల్లి విద్యాధర్ ఆవిష్కరించగా ఈ కార్యక్రమంకు కవి, అనువాదకులు, మౌలానా అజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీ హిందీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ జి.వి.రత్నాకర్ అధ్యక్షత వహించారు.

**చర్చా వేదిక:** హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో సందర్శకులను విశేషంగా ఆకర్షించే మరో కార్యక్రమం చర్చావేదిక. ప్రతి నిత్యం ఏదో ఒక అంశంపై చర్చా వేదిక నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం నేటి బాల సాహిత్యం, తీరు తెన్నులు అనే అంశంపై చర్చావేదిక(అవగాహనా కార్యక్రమం) నిర్వహించారు. ఈ చర్చా వేదికలో మణికొండ వేదకుమార్, చొక్కాపు వెంకటరమణ, డాక్టర్ సి.ఎ.ప్రసాద్, డాక్టర్ వి.ఆర్.శర్మ, డాక్టర్ అమరవాది నీరజ, దుర్గం భైతి, పెందోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# భూ కబ్జాలు లేని స్వేచ్ఛాయుత రాష్ట్ర స్థాపనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి తుమ్మల

నిజాంపేట్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త : నిజాంపేట్ కార్పోరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ శ్రీకృష్ణ గార్డెన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మేడ్చల్ మల్కాజగిరి పార్లమెంట్ కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుండి భారీగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన వారికి శాలువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో సోనియాగాంధీ రాహుల్‌గాంధీ రేవంత్‌రెడ్డిల నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చుకున్న విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే మనం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూనే వస్తున్నామని అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఒక సైనికుడిగా ఉంటూ కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జీ కొలను హన్మంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు నర్సి రెడ్డి భూపతిరెడ్డి, కొలను శ్రీనివాస్‌రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జ్యోత్స్న రెడ్డి, భవాని రెడ్డి పాల్గొన్నారు.

# అధ్వాన్నపు రోడ్లతో ప్రజల అవస్థలు

## కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో తారు మారవుతున్న రోడ్లు



కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: కూకట్‌పల్లి జోన్ పరిధిలోని గాజులరామారం, కుత్బు ల్లాపూర్, కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ళలోని పలు ప్రాంతాల్లో రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారినప్పటికీ మరమ్మతులు లేని రోడ్లపై వాహనాలు వెళ్ళడంలో తరచూ ప్రమాదాల బారినపడుతున్నాయి. జిహెచ్‌ఎంసి ఏటా కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యం. రోడ్లు వేసిన కొన్నాళ్ళకే నాణ్యత లేకపోవడంతో కొన్నాళ్ళకే రాళ్ళు తేలి గుంతలమయంగా మారిపోతున్నాయి. ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రోడ్ల నిర్మాణంలో నాణ్యతను పాటించకపోవడంతో అద్వాన్నంగా తయారవుతున్నాయి. రాత్రి వేళల్లో వీధిదీపాలు ఓ దగ్గర వెలిగితె మరో దగ్గర వెలగకుండా మొరాయిస్తున్నాయి. చీకట్లో గుంతలమయపు రోడ్లను గమనించక ప్రమాదాల బారినపడుతున్నారు. అనేక ప్రాంతాల్లో ఈ గుంతలమయపు రోడ్ల వల్ల ప్రమాదాల బారినపడుతున్నా మరమ్మతులను చేయకపోవడం ఇంజనీరింగ్ విభాగం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. కొన్ని ప్రాంతాల్లోనైతే అండర్‌గ్రౌండ్ మ్యాన్‌హోల్స్ రోడ్ల మధ్యలో ఉండిపోయాయి. వీటితో రాత్రి వేళల్లో ప్రయాణించే ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటితో రాత్రి వేళల్లో ద్విచక్రవాహనం పై కూర్చుకున్న మహిళలు, చిన్న పిల్లలు డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ వద్ద వాహనదారులు సడన్‌గా బ్రేక్ వేయడంతో కిందపడి గాయాల పాలవుతున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో అధికారుల నిర్లక్ష్యం పుణ్యమా అని కాలనీలు, బస్తీల్లో వేస్తున్న తారు, సిమెంట్‌రోడ్లు వేసిన మూన్నాళ్ళకే మట్టితేలి అద్వాన్నంగా తయారవుతున్నాయి. ఏడాదికో మారు కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నా అవి కాస్తా బూడిదలో పోసిన పన్నీరవుతున్న చందంగా తయారవుతున్నాయి. తలా తోకాలేని పాతకాలపు నిబంధనల్ని జిహెచ్‌ఎంసి అమలు చేస్తుండడంతో ఎలాంటి ఫలితం లేకుండా పోతుంది. రోడ్ల నాణ్యతకు గండికొట్టడంలో ఓవైపు కాంట్రాక్టర్లు, మరో వైపు అధికారులు పోటీపడుతున్నారు. ప్రతి ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా నైపుణ్యం గల రోడ్లు మాత్రం కనిపించడంలేదు. ప్రతి యేటా కురుస్తున్న వర్షాలతో వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతుల పేరుతో ఓ వైపు అధికారులు మరో వైపు కాంట్రాక్టర్లు పెద్దఎత్తున స్వాహా చేస్తున్నారని పనులు చేయకుండానే తప్పుడు బిల్లలు సృష్టించి గ్రేటర్ నిధులను కొల్లకొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**తారుమారవుతున్న రోడ్లు..** క్వాలిటీ లేని రోడ్లను వేయడంలో అందరిదీ ఒకే దారిలా కనబడుతుంది. ఏటా కోట్లాదిరూపాయలు ఖర్చుచేస్తున్నా నాణ్యతగల రోడ్లు మాత్రం ఎక్కడా కనిపించడంలేదు. కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కవుతూ నిబంధనలకు తిలోదకాలిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు. రోడ్లు చేసిన కొన్నాళ్ళకే కంకరతేలి కనిపిస్తున్నాయి. దీంతో రోడ్లన్నీ మూన్నాళ్ళ ముచ్చటగానే కనబడుతున్నవి. మరో వైపు బాగున్న రోడ్లమీదనే మళ్ళీ తారు, సిమెంట్ రోడ్లను వేసి బిల్లులను రాబట్టుకుంటున్న కాంట్రాక్టర్లు గుంతలు తేలిన రోడ్ల వైపు మాత్రం దృష్టి సారించడంలేదు. ఎందుకంటే గుంతలుతేలిన రోడ్లపై తారు మరింత ఎక్కువ ఖర్చయి పెద్దగా లాభం రాదన్న ఆలోచనతో ఈ అవకతవకలకు పాల్పడుతున్నట్లు తెలుస్తున్నది.

# హనీట్రాప్‌తో ఉన్నదంతా ఊడ్చేస్తారు!

- విలాసవంతమైన జీవితం గడుపుతారు
- కోట్ల రూపాయలు కొల్లగొడుతారు
- బడాబాబులను టార్గెట్ చేస్తారు
- క్రైమ్ కథా చిత్రాన్ని తలపిస్తున్న తల్లికూతుళ్ల ఉదంతం
- సింగోటం రాము హత్య కేసులో షాకింగ్ నిజాలు

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: తల్లి చేసేదే పాడు పని.. చాలదన్నట్టు కూతురును కూడా గలీజ్ దందాలోకి దింపింది. డబ్బున్న వాళ్లను టార్గెట్ చేసి, హనీట్రాప్‌తో ఉన్నదంతా ఊడ్చేస్తారు తల్లీకూతుళ్లు. డబ్బులన్నీ దండుకున్నాక దూరం పెట్టి మరో బడాబాబును టార్గెట్ చేస్తారు. చేసేది వ్యభిచారవృత్తే అయినా విలాసవంతమైన జీవితం. కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. ఈ తరహా హనీట్రాప్‌తో తల్లీకూతుళ్లు కలిసి సింగోటం రామును గుట్టుచప్పుడు కాకుండా మట్టుపెట్టారు. రాము నుంచి కోట్లు దండుకున్న తల్లీ, కూతురును ఎరగా వేసి పీడ వదిలించుకోవాలనుకుంది. పక్కా ప్లాన్‌తో రామును హత్య చేయించిందని పోలీసులు దార్యప్తులో వెల్లడైంది. జుబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సింగోటం రాము హత్య కోసం విచారణలో సంచలన విషయాలు, ట్విస్ట్‌ల మీద ట్విస్ట్‌లు వెలుగులోకి వస్తున్నాయి. రాముతో వ్యవహారం, రామును ట్రాప్ చేసిన తీరు రాము హత్య.. అంతా ఓ క్రైమ్ కథా చిత్రాన్ని మించి ఉంది. వెబ్‌సిరీస్ రేంజ్‌లో తల్లీ కూతుళ్లు ఇద్దరూ.. రౌడీషీటర్లు, ప్రియుడితో కలిసి రామును అంతమొందించారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంకు చెందిన హిమాంబి, భర్తను వదిలేసి కూతురుతో సహా హైదరాబాద్‌కు మాకాం మార్చింది. యూసుఫ్‌గూడలో ఓ కానిస్టేబుల్ ఇంట్లో అద్దెకు దిగింది హిమాంబి. కానిస్టేబుల్‌తో అక్రమ సంబంధం పెట్టుకుంది. హిమాంబి మాయలో పడ్డ కానిస్టేబుల్ డబ్బంతా ఆమెకు ఖర్చు పెట్టాడు. ఫ్యామిలీ, పిల్లలు అందరినీ దూరం పెట్టి హిమాంబినే ప్రపంచంగా మారాడు. చివరకు ఆ ఇంటిని కూడా హిమాంబి పేరు మీద రాసి ఇచ్చాడు. దీంతో తన పని పూర్తయ్యిందనుకున్న హిమాంబి ఆ కానిస్టేబుల్‌ను ఇంటి నుంచి వెళ్లగొట్టింది. ఆ ఇల్లు తనదేనని, నువ్వెవరో నాకు తెలియదని బుకాయించి పీడవదిలించుకుంది. అంతేకాదు తన ఇంట్లోనే వ్యభిచార దందాకు తెరలేపింది. తాను వ్యభిచారం చేయడమే కాకుండా, ఇతర ప్రాంతాలకు చెందిన కొంతమంది యువతులను తీసుకొచ్చి వ్యభిచారం చేయించేది హిమాంబి. అక్రమంగా బడా వ్యాపారులు, సంపన్నులను టార్గెట్ చేసింది. తన వలలో వేసుకుని.. అక్రమ సంబంధం పెట్టుకుని.. డబ్బులు దండుకునేది. కూతురు కూడ వయసుకు రావడంతో.. కూతురును కూడా బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి నెట్టింది. వేలు.. లక్షలు.. దాటి కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టింది హిమాంబి. విలాసవంతమైన జీవితం ఉండటంతో.. కూతురు కూడా వ్యభిచార వృత్తికి అలవాటు పడింది. ఇద్దరూ కలిసి బడాబాబులను హనీట్రాప్ చేయడం.. ఉన్నదంతా ఊడ్చేయడం.. ఏదోకటి చేసి దూరం పెట్టడం అలవాటుగా మార్చుకున్నారు. ఇదే క్రమంలో హిమాంబికి పరిచయమయ్యాడు సింగోటం రామన్న అలియాస్ పుట్టా రాము. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సింగోటంకు చెందిన రాము.. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపా రాలతో కోట్ల రూపాయలు సంపాదించాడు. జువ్వ ఆటతో రెట్టింపు డబ్బు సంపాదించాడు. దాదాపు వంద కోట్ల రూపాయలకు పైగా సంపాదించిన రాము, హిమాంబికి పరిచయమవడంతో గోల్డెన్ ఛాన్స్ అనుకుంది. రాముని తన వలపు వలల బంధించి.. కోట్ల రూపాయలు దండుకుంది. రాము సంపాదించిన డబ్బులో ఎక్కువ భాగం హిమాంబికే సమర్పించుకున్నాడు. రాముతో డబ్బులు కూడా అయిపోయాయి. అప్పులు కూడా స్టార్ట్ చేశాడు. ఇంతలో హిమాంబి దగ్గరకు వెళ్తున్న క్రమంలో మిగతా సిటీ 2వ పేజీలో

# అమీర్‌పేట్ దారి దోపిడీపై వీడిన మిస్టరీ

## ఆరుగురు నిందితుల అరెస్టు ❖ చోరీ సొత్తు జప్తు

హైదరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: నగరంలోని అమీర్‌పేట్‌లో ఈ నెల నాలుగవ తేదీ రాత్రి జరిగిన దారిదోపిడీ కేసుపై మిస్టరీ వీడింది. ఈ దోపిడికి పాల్పడిన ఆ రుగురు నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేయడంతో పాటు నిందితుల వద్ద నుంచి చోరీ సొత్తును జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను పంజాగుట్ట ఎపిపి మోహన్ కుమార్ మీడియాకు వెల్లడించారు. సంజీవరెడ్డి నగర్‌లో ఓ హాస్టల్‌లో చిన్నపాటి ఉద్యోగం చేసుకుంటున్న నేపాల్‌కు చెందిన రాజ్గీర్ కుమార్, బీహార్‌కు చెందిన దీపక్, శ్రీబచ్చన్‌లు ఈ నెల నాలుగవ తేదీన రాత్రి 11 గంటల సమయంలో పది వేల రూపాయలను తమ మిత్రుడికి ఇచ్చేందుకు వెళుతుండగా కారులో వచ్చిన ఆరుగురు నిందితులు వారిపై దాడిచేసి గాయపరిచి నగదుతో పాటు సెల్‌ఫోన్లను దోచుకుని పారిపోయారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు. పోలీసుల విచారణలో పంజాగుట్ట ప్రాంతానికి చెందిన మహమ్మద్ జుబేర్, సయ్యద్ అఫ్రోజ్, సయ్యద్ ఆదిల్, మహమ్మద్ సమీర్, అబ్దుల్ నదీం, షేక్ నవాజ్‌లు నిందితులుగా తేలింది. నిందితులు ఒక పథకం ప్రకారం తప్పతాగి కారులో ప్రయాణిస్తూ రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న ముగ్గురిపై దాడికి పాల్పడి వారి వద్ద నుంచి పది వేల రూపాయల నగదును, సెల్‌ఫోన్లను దోచుకుని ఉడాయించారు. పది వేల రూపాయల నగదులో తలా కొంత తీసుకున్నారు.

మిగతా సిటీ 3వ పేజీలో

## అన్నపై పెట్రోలు పోసి నిప్పంటించిన తమ్ముడు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్తః అన్నదమ్ముల మధ్య ఉన్న స్థల వివాదం కారంగా అన్నపై పెట్రోలు పోసి నిప్పంటించడంతో గాంధీఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. బేగంపేట ఏసీపీ రామలింగరాజు, బోయిన్‌పల్లి ఇన్స్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బోయిన్‌పల్లి కంసారి బజార్ రామమందిరం వీధిలోని మహంకాళి ఆలయం వద్ద అన్నదమ్ములు శ్రీనివాస్ (62), వినోద్(42)లకు సంబందించిన నివాసాలు ఉన్నాయి. కాగా అన్న శ్రీనివాస్ తన నివాసాన్ని కిరాయికి ఇచ్చి బోయిన్‌పల్లిలోని మరో చోట ఉంటున్నాడు. వినోద్ ఉండే చోట దారిలో బాత్ రూమ్ నిర్మించాలని భావించగా అన్న శ్రీనివాస్ అసలే దారి చిన్నదిగా ఉందని, ఇక్కడ బాత్‌రూమ్ నిర్మిస్తే ఇబ్బం దిగా ఉంటుందని అభ్యంతరం తెలిపాడు. దీంతో అన్నపై కక్ష పెంచుకున్న వినోద్ ఆదివారం అన్న శ్రీనివాస్ తన నివాసంలో కిరాయికి ఉంటున్న వారి వద్ద కిరాయి తీసుకొని వెళుతుండగా అప్పటికే పెట్రోలు సిద్ధం చేసి పెట్టుకున్న వినోద్ అన్నపై పోసి నిప్పంటించి పారిపోయాడు. తీవ్ర గాయాలపాలైన శ్రీనివాస్‌ను గాంధీఆస్పత్రికి తరలించారు.

## కాంగ్రెస్ పాలకుల అనుభవ రాహిత్యంతో తెలంగాణకు నీటి కష్టాలు తప్పవు

**ఎమ్మెల్యే వివేకానంద**

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: కాంగ్రెస్ పాలకుల అనుభవ రాహిత్యంతో తెలంగాణ ప్రజలకు నీటి కష్టాలు తప్పవని, తెలంగాణ ప్రయో జనాలను కేఆర్ఎంబీ తాకట్టు పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసి స్తూ, తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం బిఆర్ఎస్ అధినేత ఈనెల 13న తలపెట్టిన ఛలో నల్లగొండ బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆదివారం ఎమ్మెల్యే కెపి వివేకానంద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలపై సర్వజనులు ఏకమై కొట్లాడి సాధిం చుకున్న తెలంగాణ రాష్ట్రం గత పదేళ్ళ కాలంలో బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ అకుంఠిత దీక్షతో సస్యశ్యామలంగా మారింద న్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరిశె శ్రీనివాస్‌యాదవ్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కెపి వెంకటేష్, నవాబ్, వెంకటేష్, లక్ష్మయ్య, నర్సింగ్, తారాసింగ్, నవీన్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఛలో నల్లగొండ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

**బోనీ అండ్ గయ్ హెయిర్ డ్రెస్సింగ్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే**

132 జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్ నందు శ్రావన్, కార్తిక్‌ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన టోనీ అండ్ గాయ్ హెయిర్ డ్రెస్సింగ్‌ను ఎమ్మెల్యే కెపి వివేకానంద ముఖ్య అతిథిగా విచ్చేసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు తమ నైపుణ్యాలతో స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తూ అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సుధాకర్‌గౌడ్, జ్ఞానేశ్వర్, ఎల్లాగౌడ్, విజయ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన విశాల్‌గౌడ్

పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త : 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో శివాత్మిక క్లీనిక్ లాబరేటరీ అండ్ ఫార్మసీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.పి.విశాల్‌గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ గ్రామస్తులు, చుట్టుపక్కల కాలనీ, బస్తీ వాసులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన శివాత్మిక క్లీనిక్ లాబరేటరీ అండ్ ఫార్మసీ వారిని ఈ సందర్భంగా విశాల్‌గౌడ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో శివాత్మిక క్లీనిక్ మేనేజింగ్ డైరెక్టర్, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ వెంకట రమణ, డాక్టర్ సోమచంద్రశేఖర్, డాక్టర్ మాధురి సోమ, డాక్టర్ హిమబిందు, డాక్టర్ సోమ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### హాస్పిటల్స్‌ను ప్రారంభించిన నిజాంపేట్ మేయర్

నిజాంపేట్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త : ప్రగతినగర్ జెఎన్‌టియూ రోడ్ నెక్సా షోరూం ఎదురుగా నూతనంగా నిర్మించిన ప్రసాద్ హాస్పిటల్స్ ప్రారంభోత్సవ వేడుకల్లో మేయర్ కోలన్ నీలాగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రసాద్ హాస్పిటల్స్ యాజమాన్య వైద బృందానికి అభినందనలు తెలియజేశారు. హైదరాబాద్లోఓ పేరుగాంచిన ప్రసాద్ హాస్పిటల్స్ ప్రగతినగర్ రోడ్‌లో నిర్మించడం చాలా సంతోషమని, ఎప్పటికప్పుడు ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు రవికాంత్, బీసీ సెల్‌వైస్ ప్రెసిడెంట్ తలారి సాయి ముదిరాజ్, యువ నాయకులు ఆనంద్‌రెడ్డి, రాము, అజయ్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

## సొంత అనుభవాన్ని మించిన జ్ఞానం మరొకటి లేదు

**జస్టిస్ బి.చంద్రకుమార్**



'బొగ్గురవ్వలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ జి.హరగోపాల్. చిత్రంలో జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులు

సైఫాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమ నాయకుడు గురిజాల రవీందర్ రచించిన 'బొగ్గురవ్వలు' అనే పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఆవిష్కరించారు. తెలంగాణ విద్యా వంతుల వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లా డుతూ సొంత అనుభవాన్ని మించిన జ్ఞానం మరొకటి లేదని, సమాజంలో జరుగుతున్న దోపిడి, అన్యాయాలను తొలగించి మంచి సమాజ నిర్మాణా నికి అందరూ ప్రయత్నించాలని సూచించారు. ఈ పుస్తకాన్ని తాను చదివినప్పుడు కొంత ఉద్వేగానికి గురికావాల్సి వచ్చిందని, అద్భుతంగా ఉందని, రవీందర్ తన ఆశయాలను తెలియజేశారని, ఆయన గొప్ప వ్యక్తి భవిష్యత్తు తరాలకు ఈ పుస్తకం ఉపయోగపడుతుం దన్నారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ రవీందర్ తన అనుభవాలను చరిత్రగా రాశారని, బొగ్గురవ్వలు పుస్తకంలో అగ్ని పర్వతం లాంటి జీవితం కనిపిస్తుం దన్నారు. ప్రముఖ పాత్రికేయులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి కార్మిక ఉద్యమం దేశవ్యాప్తంగా సజీవంగా ఉందన్నారు. బొగ్గురవ్వలు పుస్తకంలో రవీందర్ రాయవలిసిన సంఘటనలు విపులంగా రాయలేకపోయారని విచారం వ్యక్తం చేశారు. సికాస, రాడికల్ తదితర ఉద్యమాల గురించి విన్నవి రాయడం జరిగిందన్నారు. అర్థశతాబ్దంగా జరిగిన ప్రజా ఉద్యమాల చరిత్రను ఒక డాక్యుమెంటరీగా చేయాల్సిన అవసరం ఉందని, ఇది భవిష్యత్తులో ఉపయోగపడుతుందని శ్రీనివాస్ చెప్పారు. ఈ సభకు డాక్టర్ చమన్‌సింగ్ అధ్యక్షత వహించగా, హెచ్ రవీందర్ పుస్తకాన్ని సమీక్ష చేశారు. రామకృష్ణారావు, సి.హెచ్.రమణాచారి, టివివి అధ్యక్షుడు అంబటి నాగయ్య, టియుఎఫ్ ఛైర్మన్ డా. చీమా శ్రీనివాస్, రచయిత గురిజాల రవీందర్ పాల్గొన్నారు.

## ఉచిత కరెంట్ వివరాలు సేకరణ



కంటోన్మెంట్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో పేద ప్రజలకు ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో భాగంగా రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం అధికారులు వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఆదివారం రైల్‌నిలయం అంబేద్కర్‌నగర్‌లో ట్రాన్స్‌కో అధికారులు ఇంటింటికి తిరిగి తెల్ల రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డుల వివరాలను సేకరించారు.

## హనీట్రాప్‌తో ఉన్నదంతా ఊడ్చేస్తారు!

హిమాంబి కూతురు నసీమాను చూశాడు రాము. కూతురుతో పడక సుఖం కావాలని అడిగాడు రాము. తన కూతురు అలాంటిది కాదని, అడ్డు చెప్పింది హిమాంబి. పలుమార్లు రాము ఏకంగా నసీమాను వేధించాడు. దీంతో తెలివిగా ఆలోచించింది హిమాంబి. ఇక రాముతో పనేముంది.. పీడ వదిలించుకోవాలనుకుంది. కూతురుతో కలిసి పక్కా ప్లాన్‌తో రామును అత్యంత కిరాతంగా హత్య చేయించింది. అయితే.. రాము హత్యలో రౌడీ షీటర్లు, రాము స్నేహితుడు మణికంత ఎందుకు ఇన్వాల్వ్ అయ్యారు. ఇక్కడే పెద్ద ట్విస్ట్.. సినిమాటిక్ రేంజ్‌లో మణికంత, హిమాంబి, నసీమా, రౌడీషీటర్ల మధ్య పరిచయం వెలుగులోకి వచ్చింది. సింగోటం రాము.. జువ్వ ఆడే క్రమంలో మణికంత, వినోద్ పరిచయం అయ్యారు. గ్యాంగులుగా ఏర్పడి పలు ప్రాంతాలకు వెళ్తూ జువ్వ ఆడేవాళ్ళు ఈ ఆటలో రాము వంద కోట్ల రూపాయల వరకు సంపాదించగా.. మణికంత, వినోద్ మాత్రం 20 కోట్ల వరకు సంపాదించారు. దీంతో.. ఈర్ష్య మొదలైంది. మనస్పర్థలు వచ్చాయి. రాము, మణికంత మధ్య గొడవ జరిగింది. మణికంతను తీవ్రంగా కొట్టి, కారుతో ఢీకొట్టి, కారును పైకి ఎక్కించి హత్య చేయబోయాడు రాము. లక్కీగా మణికంత ప్రాణాలతో బయటపడినప్పటికీ, మొహానికి తీవ్ర గాయాలై, ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నాడు. రాము దాడిలో తీవ్రంగా గాయపడ్డ మణికంత.. కక్ష పెంచుకున్నాడు. రివేంజ్ తీర్చుకోవాలని రామును ఎలాగైనా అంతం చేయాలని అనుకున్నాడు. పలుమార్లు రెక్కీకూడా నిర్వహించాడు. రాము దాడిలో తీవ్రంగా గాయపడ్డ మణికంత.. కక్ష పెంచుకున్నాడు. రివేంజ్ తీర్చుకోవాలని రామును ఎలాగైనా అంతం చేయాలని అనుకున్నాడు. పలుమార్లు రెక్కీ నిర్వహించి.. అటాక్‌కు ప్లాన్ చేసి విఫలమయ్యాడు. సరైన అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు మణికంత. ఇద్దరిఇ మధ్య స్నేహం ఉన్నప్పుడు రాము, మణికంత, వినోద్‌లకు హిమాంబిని పరిచయం చేశాడు. హిమాంబి దగ్గరకు రాము వెళ్లే క్రమంలో వినోద్, మణికంతను కూడా తీసుకెళ్లేవాడు. వినోద్‌కు హిమాంబి కూతురు నసీమాతో ఏర్పడ్డ పరిచయం ప్రేమగా మారింది. నసీమాను డీప్‌గా లవ్ చేశాడు వినోద్. ఇంతలో సింగోటం రాము తనను వేధిస్తున్న విషయం ప్రియుడు వినోద్‌తో చెప్పింది నసీమా. ఆగ్రహానికి లోనైన వినోద్ స్నేహితుడు మణికంతకు విషయం చెప్పాడు. ఇదే అవకాశంగా మలుచుకున్నాడు మణికంత. ఎప్పటి నుంచో రాముఉ హత్యకు ప్లాన్ చేస్తున్న మణికంత..నసీమా, హిమాంబి సాయం కోరాడు. రామును వదిలించుకోవాలని చూస్తున్న హిమాంబికి మణి, వినోద్‌లు కూడా తోడయ్యారు. హిమాంబి కూడా అదే అదనుగా తోడయ్యారు. హిమాంబి కూడా ఇదే అదనుగా భావించింది. రాముకు కాల్ చేసి పిలిచింది. ఎప్పటి నుంచో తన కూతురిపై ఆశపడుతున్నావ్ కదా.. కూతురును రెడీ చేసి సిద్ధంగా ఉంచుతాను అని నమ్మబలికింది. దీంతో.. రాము ఆనందానికి అవదుల్లేవు. ఎంతో కాలంగా వేచిచూసిన అద్భుత క్షణం అనుకున్నాడు. ఉన్నఫలంగా వెళ్లాడు. ఎక్కడికి వెళ్లినా ఐదారుగురు గ్యాంగ్ వెళ్లే రాము, ఈసారి ఒంటరిగా వెళ్లాడు. వెళ్తూ వెళ్తూ మద్యం బాటిల్ కూడా తీసుకెళ్లాడు. యూసుఫ్‌గూడ ఎల్ఎన్ నగర్‌లోని హిమాంబి ఇంటికి చేరుకున్నాడు రాము. ఈ విషయాన్ని వినోద్, మణికంతలకు చెప్పింది హిమాంబి. అప్పటికే ప్లాన్ పక్రారం.. రౌడీషీటర్ జిలానీతో పాటు బయట 11 మందితో ఎదురుచూస్తున్న గ్యాంగ్ హిమాంబి ఇంట్లోకి ప్రవేశించారు. నసీమా, హిమాంబి ముందే విచక్షణారహితంగా కత్తులతో దాడి చేశారు. రాము మర్మాంగాలను కోశాడు వినోద్. రాము ఒంటిపై 25కిపైగా కత్తిపోట్లు అవడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు రాము. హత్యకు సహకరించిన రౌడీషీటర్ జిలానీ తన అనుచరులతో అక్కడి నుంచి పారిపోయాడు. మణికంత, రాము బామ్మర్దికి వీడియో కాల్ చేశాడు. మీ బావను చంపేశానని.. వచ్చి బాడీ తీసుకెళ్లామని చెప్పాడు. మణికంత, వినోద్, మరికొందరు కలిసి రాంరెడ్డినగర్‌లోని బార్ వద్ద టపాకాయలు కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. పాతకక్షల కారణంగా ఒకరు.. తన ప్రియురాలిని లోబర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని మరొకరు.. వాడుకున్నాం ఇక వదిలేద్దాం అనే స్వలాభాపేక్ష మరొకరిది. మొత్తానికి సింగోటం రాము అత్యంత కిరాతకంగా హతమయ్యాడు. వక్రమార్గంలో సంపాధించినా.. అబ్దుల్ కలాం ఫౌండేషన్ పేరుతో సోషల్ సర్వీస్ చేస్తున్న రాము హతమయ్యాడు. ఇప్పుడిప్పుడే పొలిటికల్ ఎంట్రీ ఇద్దామనుకున్న రాము ఆశలు ఆవిరయ్యాయి. తాను పట్టిన కత్తికి తానే బలైనట్టు.. తన మనుషుల చేతుల్లోనే రాము బలయ్యాడు. రాము హత్యతో ప్రమేయం ఉన్న మణికంత, వినోద్, మహ్మద్ ఖైసర్, కావలి శివకుమార్ అలియాస్ బండ శివ, కప్పల నిఖిల్‌తో పాటు హత్యకు ప్రోత్సహించిన నసీమా, ఆమె తల్లి హిమాంబి అలియాస్ హసీనాలను అరెస్ట్ చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

## అనారోగ్యంతో కార్మికురాలు ఆత్మహత్య

చార్మినార్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ మహిళా కార్మికురాలు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం బహదూర్ పుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఇన్‌స్పెక్టర్ హబీబుల్లా కథనం ప్రకారం.. కిషన్‌బాగ్ సమీపంలోని ఎస్‌పి నగర్‌కు చెందిన బిచ్చన్న భార్య శంకరమ్మ (55) కార్మికురాలుగా పని చేస్తున్నది.కాగా శంకరమ్మకు ఆరోగ్యం సరిగ్గా లేనందున మూడు ఆఫరేషన్లు జరిగాయి.తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న శంకరమ్మ జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది.ఆదివారం ఉదయం భర్త బిచ్చన్న ఇంట్లోకి వెళ్లి చూడగా భార్య శంకరమ్మ మృతి చెంది ఉంది.భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం శంకరమ్మ మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఈ కేసును బహదూర్‌పుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### భార్యతో గొడవ పడి భర్త బలవన్మరణం

మైలార్‌దేవ్‌పల్లి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : భార్యతో గొడవ పడి ఓభర్త ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దర్గా ప్రాంతానికి చెందిన నర్సింహ్మాచారి (60) వృత్తి రీత్యా కార్పెంటర్.శనివారం రాత్రి నర్సింహ్మాచారి భార్యతో గొడవకు దిగాడు.ఆదివారం ఉదయం పని కోసం వెళ్లిన నర్సింహ్మాచారి కొంత సేపటి తర్వాత ఇంటికి వచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టు మార్టం నిర్వహించిన అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యలకు అప్పగించారు.ఈ కేసును రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### రసీదులను జాగ్రత్తగా ఉంచుకోవాలి



రసీదులను పంపిణి చేస్తున్న దిడ్డి రాంబాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: గృహజ్యోతి పథకం కోసం ప్రజలు ప్రజా పాలన కార్యక్రమంలో అందజేసిన సమాచార ధృవీకరణ కార్యక్రమం సిబ్బంది ద్వారా జరుగుతున్నదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దిడ్డి రాంబాబు చెప్పారు. ఆదివారం కాచిగూడ లింగంపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తుకు సంబంధించిన రసీదు, ఆహార భద్రతా కార్డు నంబరు, ఆధార్ కార్డు నెంబరు అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సూచించారు.

### అయోధ్య రామాలయ కరసేవకులకు ఘన సత్కారం



కరసేవకులతో ఆలయ ఛైర్మన్ పొటేల్ కృష్ణయాదవ్

ముషీరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: అయోధ్య రామాయం కోసం కరసేవలో పాల్గొన్న కరసేవకులను ఆదివారం కవాడిగూడలోని పరమేశ్వరాలయంలో ఘనంగా సత్కరించారు. ఆలయ ఛైర్మన్ పోటేల్ కృష్ణయాదవ్, విశ్వహిందూ పరిషత్ కవాడిగూడ ప్రఖండ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ అయోధ్య రామజన్మభూమి విజయోత్సవ సభలో కరసేవకులు ఆనాటి పరిస్థితులను, ప్రస్తుత అయోధ్య పరిస్థితులను వివరించారు. ఈ కార్యక్రమంకు విశ్వహిందూ పరిషత్ అఖిలభారత సమా కార్యదర్శి సత్యం, సభాధ్యక్షులు పొటేల్ కృష్ణయాదవ్, గౌరవ అతిథులు ధర్మజాగరణ సమన్వయ సమితి ప్రాంత సహ సంయోజకులు శ్రీనివాసన, ప్రముఖ న్యాయవాది గోసేవా సమితి విభాగ్ ప్రముఖ్ వనజ కుమార్, ప్రముఖ వ్యాపారవేత్త పొటేల్ రాహుల్ (సాయి), విశ్వహిందూ పరిషత్ కవాడిగూడ, సికింద్రాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు ముత్యాలరావు, కవాడిగూడ ఆర్యసమాజ్ నిర్వాహకులు గడీల ఆంజనేయులు పాల్గొని కరసేవలకు శాలువాలతో సత్కరించారు.



కొంపల్లి సెక్షన్‌లోని ప్రజా అపార్ట్‌మెంట్‌లో గృహజ్యోతి ధ్రువీకరణ కార్యక్రమాన్ని సందర్శించిన మేడ్చల్ అధికారులు

## అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: ప్రజల సమస్యల పరిష్కారమే బీజేపీ లక్ష్యమని కంటోన్మెంట్ బోర్డు మెంబర్ జె. రామకృష్ణ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ 5వ వార్డులో రెండు కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 5వ వార్డు కాలనీవాసుల అభ్యర్థన మేరకు భుగర్భ డ్రైనేజీ, స్ట్రాంవాటర్ డ్రైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు సబ్కా సాత్ సబ్కా వికాస్ లక్ష్యంగా పని చస్తున్నామని పేర్కొన్నారు. కంటోన్మెంట్ పరిధిలో నెలకొన్న ప్రతీ సమస్యకు పరిష్కారం చూపిస్తామని, అభివృద్ధే మా సిద్ధాంతం అని చెప్పారు. ఈ కార్యాక్రమంలో కాలనీ అధ్యక్షుడు భాస్కర్ రావు, రవి, శంకర్, రాములు, నాగరాజు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి.వేణుగోపాల్**



హైదరాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: మహిళా సాధికారత సాధించడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన పాత్రను పోషించి ఉత్తమ వ్యాపారవేత్తలుగా ఎదగాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి.వేణుగోపాల్ అన్నారు. ఆదివారం నగరంలోని టూరిజం ప్లాజాలో భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ, ఉపాధి కల్పన, శిక్షణ, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్,తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టవిటీ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఒక రోజు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ ఇవి.వేణుగోపాల్ పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని తద్వారా మహిళా సాధికారత సాధించి ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలన్నారు. అటువంటి నైపుణ్యం, ఓపిక నేర్చుకునే తత్వం పట్టుదల పురుషుల్లో అంతగా ఉండదని, అందుకని ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డైరెక్టర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెనింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ నగేష్, డైరెక్టరేట్ ఆఫ్ ఇండస్ట్రీస్ పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ (ఎంఎస్ఎంఈ) మధుకర్‌బాబు, ప్రొడక్టవిటి కౌన్సిల్ అధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. నగేశ్ మాట్లాడుతూ శ్రామికశక్తి నైపుణ్యం అంతరాలను తగ్గించుకోవడం, సమ్మిళిత అభివృద్ధిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఒక సమగ్ర చొరవుగా కనిపిస్తోందన్నారు.



జూబ్లీహిల్స్‌లో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## అద్భుతం సర్వవిద్యలతల్లి సరస్వతీదేవికి నృత్యనీరాజనం



ఇండియన్ పవర్ ఐకాన్‌తో గురువులను సన్మానిస్తున్న జస్టిస్ మధుసూదన్, రంజిత్, దైవజ్ఞశర్మ, రాజశేఖర్‌రెడ్డి తదితర అతిథులు

నాంపల్లి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : చదువు, సంగీత, సాహిత్య, నృత్య సకల విద్య జ్ఞానప్రాప్తికి తల్లి అయిన సరస్వతీదేవి పుట్టినరోజు వసంత పంచమిని పురస్కరించుకొని విద్యార్థులు వివిధ కళాప్రదర్శనలతో నృత్యనీరాజనం సమర్పించడం, ఈ మహోన్నత కార్యక్రమాన్ని ఆర్‌కె కళా సాంస్కృతిక ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా రంజిత్ అధ్యక్షతన ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం విశిష్ట తను సంతరించుకొందని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బూర్గుల మధుసూదన్ అన్నారు. చిల్లా రాజశేఖర్‌రెడ్డి సభాధ్యక్షతన తెలంగాణ సార స్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ మధుసూదన్ గౌరవ అతిథులు దైవజ్ఞశర్మ, మిస్సెస్ తెలంగాణ సుధానా యుడు, ఆంజనేయులు, జ్యోతి, కె.భాస్కర్‌గుప్తా తదితరులతో కలిసి గురువు రాఘవ, చంటి, కళ్యాణిభవ్యశ్రీ, దుర్గ, శివకుమార్, దీక్షిత, ప్రతీక, వసంత, రాఘవేంద్ర, వరుణ్, విజయ్‌బాబు, సురేష్ కుమార్, సాయినికిత తదితరులను ఇండియన్ పవర్ ఐకాన్ అవార్డులతోను, నృత్యనీరాజనం సమర్పించిన కళాకారులను శ్రీపంచమి అవార్డులతోను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

## కేంద్రంలోని బిజెపితోనే అభివృద్ధి సాధ్యం



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆదివారం భక్తులు అయోధ్యలోని శ్రీ రామ మందిరాన్ని సందర్శించటానికి ప్రత్యేక ట్రైన్‌లో తరలి వెళ్లారు.మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి,రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కాంటెస్టెంట్ ఎమ్మెల్యే,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిలు కలిసి ప్రత్యేక ట్రైన్‌కు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఐదు వందల సంవత్సరాల పోరాటం అనంతరం అయోధ్యలో భవ్య శ్రీ రామ మందిరం నిర్మాణం జరిగిందని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర,జిల్లా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ పార్లమెంట్ అభివృద్ధి కోసం మ్యానిఫెస్టో



మ్యానిఫెస్టోను ఆవిష్కరిస్తున్న స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: సికింద్రాబాద్ పార్లమెంట్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ నేత, సిఎ వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో రూపొందించిన సికింద్రాబాద్ పార్లమెంట్ మెనిఫెస్టోను కాంగ్రెస్ ఫర్ సికింద్రాబాద్ స్టూడెంట్స్, వర్కింగ్ ప్రొఫెషనల్ ప్రతినిధులు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ సారి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుదని చెప్పారు. ఇందులో భాగంగా వేణుగోపాలస్వామి సారథ్యంలో నియోజకవర్గాల అభివృద్ధికి ప్రభుత్వ నిధులతోపాటు, స్వచ్ఛంద సంస్థల నిధులను కూడా వినియోగించేలా ప్రత్యేక మ్యానిఫెస్టో రూపొందించినట్లు చెప్పారు. రాహుల్‌గాంధీ తలపెట్టిన భారత్ జోడో న్యాయ యాత్రను స్పూర్తిగా తీసుకుని వేణుగోపాలస్వామి సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి డివిజన్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి ఆయన ద్వారా రెండు కోట్లు సిఎస్ఆర్ నిధులను వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హర్షవర్ధన్, రంగారెడ్డి, సుశ్రుత్, షరీఫ్, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను ఆడ, మగ తేడా లేకుండా పెంచాలి: సరోజా వివేక్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: చిన్నతనం నుంచే పిల్లలను ఆడ, మగ తేడా లేకుండా మంచి, చెడులను తెలియజేస్తూ పెంచాలని గడ్డం సరోజావివేక్ సూచించారు. నారాయణగూడలోని కేశవ మెమోరియల్ కళాశాలలో జరిగిన మహిళా శక్తి సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. పూర్వం ఇళ్ళలో తాతయ్యలు, నాయనమ్మలు కూడా చాలా కండిషన్లు పెట్టేవారని, ప్రస్తుతం తల్లిదండ్రులు అమ్మాయిలను అన్ని విధాల ప్రోత్సహిస్తున్నారని ఆమె వివరించారు. ఇంట్లో మహిళా ఆరోగ్యంగా ఉంటేనే ఇల్లు సజావుగా నడుస్తుందనేది వాస్తవమని, వర్కింగ్ ఉమెన్స్ ఇంటిపని, ఆఫీస్ పని రెండింటిని చక్కగా సక్సెస్‌ఫుల్‌గా చేస్తున్నారంటే ఆది వారి సామర్థ్యానికి ఉదహరణ అన్నారు. ఈ మహిళా సమ్మేళనంలో తాను పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు.

**పేద విద్యార్థులు క్రీడల్లో, అంతర్జాతీయ వేదికల్లో సత్తా చాటేలా చేస్తాం**

మహిళలు ఒకరికి మరొకరు సహకారం అందించుకుంటూ ముందుకు సాగాలని నైనా జైస్వాల్ సూచించారు. కాలాన్ని బట్టి మహిళలు ఎన్నో పాత్రలను పోషిస్తుంటారని, అందుకే భారతీయ సంస్కృతిలో స్త్రీలకు ఎంతో గౌరవం ఉంటుందన్నారు.

## అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు



వెంగళ్‌రావునగర్ శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజల్లో పాల్గొన్న జూబ్లీహిల్స్ శాసనసభ్యులు మాగంటి గోపినాథ్

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: నియోజకవర్గంలోని ప్రజలంతా అన్ని వేళల సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఆదివారం వెంగళ్‌రావునగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మూడవ సారి కూడా జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి తనను హ్యాట్రిక్‌గా గెలిపించినందుకు నియోజకవర్గం ప్రజలకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆలయంలో ఆలయ ఛైర్మన్ ఈ.నర్సింగ్‌రావు ఏర్పాటు చేసిన పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలను తీసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ తరపున నర్సింగ్‌రావు శాసనసభ్యులు మాగంటి గోపినాథ్‌ను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్‌కుమార్, విజయ్ ముదిరాజ్, వేణు, రామకృష్ణ, పవన్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## ప్రజలను ఇబ్బందుకుల గురిచేస్తే కఠిన చర్యలు తప్పవు

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



బస్తీలో పర్యటిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారు ఎవరైనా ఉపేక్షిం చబోమని, వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీ లాల్‌పేట్ డివిజన్‌లోని సీసీనగర్ డబుల్ బెడ్ రూమ్ పరిసర ప్రాంతాల్లో రాత్రిపూట ఇతర ప్రాం తాలకు చెందిన కొందరు వ్యక్తులు మద్యం, గంజాయి సేవిస్తూ తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఇటీవల స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆయన ఆదివారం పోలీసు, ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి సీసీనగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పరిసరాలలో పర్యటించారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు వాహనాలలో తమ బస్తీకి వచ్చి ఇక్కడే మద్యం సేవించడం, గంజాయి తాగుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆకతాయిల కారణంగా ఇండ్లల్లో నుండి బయటకు రావాలంటేనే మహిళలు భయపడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, బస్తీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, నేతలు ప్రేమ్‌కుమార్, అరుణ్‌గౌడ్, కుమార్ యాదవ్, అబ్బాస్, సంపత్, భీంరావ్, లక్ష్మణ్, స్వామిదాస్, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



నాచారం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైన సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్సై సారంగపాణి కథనం ప్రకారం.. నాచారం నుంచి మౌలాలి రైల్వే స్టేషన్ వైపుకు వెళ్లే రోడ్డుకు పక్కనే ఉన్న చెట్లపొదల్లో గుర్తు తెలియని 30 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి మృతి చెంది ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది.దీంతో ఎస్సైలు సారంగపాణి, గంగాధర్ రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. మృతిడి దుస్తుల్లో ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో పోలీసులు మృత దేహాన్ని స్వాదీనం చేసుకొని గాంధీకి తరలించారు. నిర్మానుష ప్రాంతంలో మృతి చెంది కనిపించడంతో ఎవరైన హత్య చేసి ఇక్కడ పడవేశారా లేద ఇక్కడికి మద్యం మత్తులో వచ్చి పడి చనిపోయాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైన మృతుడికి సంబందించిన వారు ఉన్నట్లయితే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

## విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు శిక్షణ దోహదం

**ఇంపాక్ట్ ఫౌండేషన్ ట్రైన్ ది ట్రైనర్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా చీకటి ప్రభాకర్**



హైదరాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: యువతను ఉత్తేజపరుస్తూ స్ఫూర్తిగా నిలుస్తూ గంప నాగేశ్వరరావు ఆధ్వర్యం లో ఆనేక విజయాలు సాధిస్తున్న ఇంపాక్ట్ ఫౌండేషన్‌లో కాకతీయ మీడియా హౌస్ సిఇవొ సి.హెచ్.ప్రభాకర్ ట్రైన్ ది ట్రైనర్ కోర్సు పూర్తి చేశారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లోని ఒక హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఎగ్జి క్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆదినారాయణ రెడ్డి చేతుల మీదగా సర్టిఫైడ్ ట్రైనర్ సర్టిఫికేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ఫౌండేషన్ గంప నాగేశ్వరరావుకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆదినారాయణరెడ్డికి సి.హెచ్.ప్రభాకర్ కృతజ్ఞతలు చెప్పారు. విద్యార్థులు, వర్ధమాన వ్యాపారస్తులు, ఉద్యోగులు వారి విద్య, వృత్తి, నైపుణ్యాలు పెంపొం దించుకునేలా వారిలో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు తన శిక్షణ ఉపయోగపడుతుందని ఈ సంద ర్భంగా ప్రభాకర్ చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు పరీక్షా సమయాల్లో మానసిక వత్తిడి తగ్గించుకునేలా, మోటివేషన్ క్లాసులు తప్పనిసరి అని అందుకోసం తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## తెలుగు భాష పరిరక్షణకు ఎక్కువ ప్రాధాన్యతకు కృషి జరగాలి

**విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు**

చిక్కడపల్లి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: ఆంగ్ల భాష వినియోగాన్ని తగ్గించుకుని తెలుగు భాషకు ఎక్కువ ప్రాధాన్యతకు కృషి జరగాల్సిన అవసరం ఉందని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రసార మాధ్యమాల్లో విధులు నిర్వహిస్తున్న టీవీన్యూస్ ప్రజెంటర్స్–2023కు గాను పురస్కారాలను ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత లోకం కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ సందర్భంగా జీవిత సాఫల్య పురస్కారాల ను పిళ్ళా నిర్మల(ఫ్రీలాన్స్), జి.రమణబాబు తదితరులకు ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు చేతులమీదుగా అందుకున్నారు. గంగోత్రి గోసంరక్షణ సమితి చైర్మన్ జి.హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం, ఆర్య లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ చిల్లా రాజశేఖరరెడ్డి, యువకళావాహిని సంస్థ అధినేత లంక లక్ష్మినారాయణ, హెలెన్ కిల్లర్స్ ఇన్సిటిట్యూట్ రీసర్చ్ చైర్మన్ పి.ఉమర్ ఖాన్, ఇనుగాల యుగేంధర్‌రెడ్డి, కళాభిమాని శైలజ, పారిశ్రామికవేత్త కె.విజయలక్ష్మి, కళాపోషకులు వీరభోగ వసంతరాయలు, తదితరులు పాల్గొన్నారు.

## బాల సాహిత్యానికి ప్రోత్సహించడం మంచి సంప్రదాయం

**దూరదర్శన్ విశ్రాంత అదనపు డైరెక్టర్‌జనరల్ డా. రేవూరి అనంతపద్మనాభరావు**



బాలసాహిత్య పురస్కార స్వీకర్తలతో అనంతపద్మనాభరావు, చొక్కాపు, కిశోర్, రాంబాబు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : బాలల మనోవికాసానికి, వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదం చేసే బాలసాహిత్య రచయితలను ఎంపికచేసి పురస్కారాలతో ప్రోత్సహించడం మంచి సంప్రదాయమని, ప్రముఖ కవి, అవధాని, శతాధిక గ్రంథ కర్త, దూరదర్శన్ అదనపు డైరెక్టర్ జనరల్ డా. రేవూరి అనంత పద్మనాభరావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, బాలసాహిత్య పరిషత్, మాచిరాజు బాలసాహిత్యపీఠం సంయుక్త ఆధ్వర్యంలో చొక్కాపు వెంకటరమణ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అనంతపద్మనాభరావు ఆత్మీయ అతిథులు వి.కిశోర్, సిఎస్.రాంబాబు, రాజశేఖరరాజు, శర్మ, నారాయణమూర్తి, మార్కండేయులు, ప్రసాద్ తదితరులతో కలిసి కథల చందమామ మాచిరాజు కామేశ్వరరావు తల్లిదండ్రుల పేరిట ఏర్పాటుచేసిన మాచిరాజు సీతారామయ్య రత్నకుమారి దంపతుల స్మారక బాలసాహిత్య పురస్కారం 2023ను చందమామ పత్రికలో 750కిపైగా అత్యధిక కథులు వ్రాసిన వసుంధర దంపతులకు; కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డా. దాసరి వెంకటరమణలను ఘనంగా సత్కరించి ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. చొక్కాపు వెంకటరమణ అధ్యక్షోపన్యాసంలో బాలసాహిత్య ప్రాముఖ్యతను సవివరంగా తెలియజేశారు.

## మణికొండలో అవిశ్వాసంను నెగ్గించుకుంటాం

**బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి.. 14మంది సభ్యులు అవిశ్వాసానికి మద్దతుగా ఉన్నారు**

నార్సింగి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీలో చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్‌పై పెట్టిన "అవిశ్వాస" తీర్మాణంను నెగ్గించుకొని చూపిస్తామని బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గండిపేట మండలంలో అవిశ్వాస తీర్మాణాల పర్వం కొనసాగుతుంది. మూడు మున్సిపాలిటీలు ఉంటే ఇప్పటికే రెండు మున్సిపాలిటీలలో సభ్యులు అవిశ్వాస నోటీసులను కలెక్టర్‌కు అందజేశారు. అధికారగణం అవిశ్వాసం పెట్టిన కార్పోరేటర్లు, కౌన్సిలర్ల సంతకాలు పరిశీలన చేశారు. బండ్లగూడ కార్పోరేషన్‌లో ఈ నెల 16.వ,తేదీన, మణికొండలో ఈ నెల 22.వ,తేదీన "అవిశ్వాస" తీర్మాణంపై సమావేశం పెడుతున్నట్లు అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఈ సందర్భంగా మణికొండ మున్సిపల్ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చైర్మన్ తీరు పట్ల సభ్యులంతా ఆగ్రహంగా ఉన్నారని, ఇటీవల నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో చైర్మన్ నిర్ణయాలను 19.మంది సభ్యులు ఏకమై వ్యతిరేకించామని తెలిపారు. సభ్యుల మెజారిటీ కోల్పోయిన చైర్మన్ స్వచ్ఛందంగా కుర్చీ దిగిపోవాలని హితవు పలికారు. మణికొండలో ఎవరు దోపిడి చేస్తున్నారో? ఎవరు దోపిడికి గురవుతున్నారో? మున్సిపల్ ప్రజలందరికి అర్థమవుతుందన్నారు. సభ్యుల మధ్య అనైక్యత తీసుకు వచ్చేందుకు చైర్మన్ వేస్తున్న ఎత్తులన్నీ చిత్తవుతున్నాయని, సభ్యులమంతా ఏకతాటిపై నిలిచి అవిశ్వాసంను గెలిపించుకొని తీరుతామని రామకృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ అన్ని పార్టీలకు చెందిన కౌన్సిలర్లు చైర్మన్ ఒంటెద్దు పోకడలను వ్యతిరేకించి అవిశ్వాసంకు మద్దతు పలుకుతున్నారని వివరించారు. అందరం ఒకే మాటపై ఉన్నామని, అవిశ్వాసంను నెగ్గించుకుంటామన్నారు.

## క్యాలండర్‌ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క



తార్నాక, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: ఆదివాసీ విద్యార్థి సంఘం(ఎఎస్‌యు) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఆదివాసీ విద్యార్థుల సమస్యలపై ఎఎస్‌యూ చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. భవిష్యత్‌లో ఆదివాసి ప్రాంతాల్లో విద్య, ఉపాది అవకాశాల కోసం కృషి చేయాలని ఆమె సూచించారు. ఆదివాసి ప్రజల ఇలవేల్పు పండుగలను గుర్తు చేస్తూ రూపొందించిన కేలండర్ ఆవిష్కరణ పట్ల ఆమె సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ సాగబోయిన పాపారావు, ప్రధాన కార్యదర్శి ఆరేం అరుణ్ కుమార్, ఉపాధ్యక్షులు గౌరి వేని ప్రవీణ్ కుమార్, లక్ష్మీచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మామిడాల మల్లేష్, సభ్యులు ఆరె విజయ్ తధితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో సెమీ ఫైనల్‌కు చేరుకున్న సికింద్రాబాద్ టీమ్



సికింద్రాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్తః సికింద్రాబాద్ పార్లమెంట్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో భాగంగా గత ఐదు రోజులుగా లీగ్ దశలో దాదాపు 30 టీమ్‌లు ఐదు మున్సిపల్ డివిజన్‌ల నుండి పాల్గొనగా సీతాఫల్‌మండి డివిజన్ నుండి ఎఎన్‌సీసీ 11 టీమ్, ఉస్మానియా యూనివర్సిటీ 11 టీమ్‌లు సికింద్రాబాద్ నియోజకవర్గం నుండి సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఇరు జట్లు వచ్చే వారం నుండి జరిగే ఫైనల్స్‌లో పాల్గొనబోతున్నాయి. సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ తరపున ఎస్‌పీఎల్‌ఎల్ తరపున టోర్నమెంట్ కో ఆర్డినేటర్ అభిషేక్ ముదిరాజ్ విజేలతకు శుభాకాంక్షలు తెలి పారు. ఈ కార్యక్రమంలో సాయిమధుకర్, కిషోర్, పవన్, రవి, చక్రధర్, కార్తీక్, రాజేందర్, సందీప్ పాల్గొన్నారు.

## బౌద్ధనగర్‌లో ప్రవాసి బస్తీ

సికింద్రాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్తః ప్రవాసి బస్తీ అభియాన్ కార్యాక్రమంలో భాగంగా ఆదివారం బౌద్ధనగర్ డివిజన్ బూత్ 67 పరిధిలో ప్రవాసి కార్యాకర్త గాజుల హంసరాజు, బూత్ ఇంచార్జి బిక్షపతి పార్టీ నేతలతో కలిసి పాదయాత్ర జరిపారు. బస్తీవాసులకు కర పత్రాలు అందజేస్తూ కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి అనేక రకాల పథకాలు చేపడుతున్న విషయాలు ప్రజలకు తెలియ జేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యాక్రమాలతో ముందుకు సాగుతున్నారని తెలిజేశారు. ఈ కార్యాక్రమంలో మహంకాళి జిల్లా చేనేత కో కన్వినర్ నేతి రాజ్‌కుమార్, నాగరాణి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అమీర్‌పేట్ దారి దోపిడీపై వీడిన మిస్టరీ

నిందితు లపై దారిదోపిడీ కేసు కింద కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి ఏడు వేల రూపాయల నగదుతో పాటు బాధితుల సెల్‌ఫోన్లను జప్తు చేశారు. నిందితుల్లో ఆదిల్ గతంలో ఓ దొంగతనం కేసులో నిందితుడుగా తేలింది. కాగా ఈ కేసులో ఆరుగురు నిందితులను నాంపల్లి కోర్టులో హాజరు పరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు చంచల్ గూడ జైలుకు రిమాండుకు తరలించారు. ఈ సమావేశంలో పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రారంభమైన బ్రాహ్మోత్సవాలు

## వామపక్షాల ఐక్యతతో మతోన్మాద బిజెపిని ఓడించగలం

**ఎంఎల్‌పిఐ(రెడ్‌ఫ్లాగ్) కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎంఎస్.జయకుమార్**



అభివాదం చేస్తున్న నాయకులు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: దేశంలో కమ్యునిస్టుల శక్తుల ఐక్యతతోనే మతోన్మాద బిజెపిని ఓడించగలుగుతామని ఎంఎల్‌పిఐ (రెడ్‌ఫ్లాగ్) కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎంఎస్.జయ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రెడ్‌ఫ్లాగ్ 3వ తెలంగాణ రాష్ట్ర మహాసభలు ప్రారంభమయ్యాయి. మహాసభలకు ప్రధానవక్తగా హాజరైన కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎంఎస్.జయకుమార్ మాట్లాడుతూ బిజెపి మతోన్మాద, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసీజం విధానాలను దేశభక్తులందరు తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. మతతత్వం, కులతత్వం, ప్రాంతీయ ఉన్మాదాలను రెచ్చగొట్టే బిజెపిని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని విజ్ఞప్తిచేశారు. స్వదేశీ, విదేశీ బహుళజాతి కంపెనీలకు జాతి సంపదను దోచిపెట్టే బిజెపి వ్యతిరేక విధానాలను, దుశ్చర్యలను విమర్శించారు. మహాసభకు కేంద్ర కమిటీ కార్యవర్గ సభ్యుడు బసవలింగప్ప అధ్యక్షత వహించారు. వేదికపై వేమూరి భాస్కర్, సుధమల భాస్కర్, మాన్యపు బుజేందర్, నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యదర్శి దొంతి రాజేష్ ఖన్నా పాల్గొన్నారు.

**రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా దొంతి రాజేష్‌ఖన్నా ఏకగ్రీవం**

మహాసభలో చివరిగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. 13 మంది రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికైనవారిలో సుదమల్ల భాస్కర్, వేమూరి భాస్కర్, మాన్యపు బుజేందర్, బిఎన్.చారి, మిట్టా అంజన్న, ఎండి.ఖాశీం, ఆర్.సంతోష్, సుధా, సత్యం, విజయ్, లింగుస్వామి ఎన్నికయ్యారు.

## వైఎస్ఆర్‌సీపీ ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వైఎస్ఆర్సిపి నేతలు

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజ కవర్గం పరిధిలోని కెపిహెచ్‌బి కాలనీ కమ్యూనిటీ హాల్లో వైఎస్ఆర్సివి ఐటి వింగ్ ఆధ్వర్యంలో దర్శి నియోజకవర్గం ప్రజలకు బూచేపల్లి వారి ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి అభ్యర్థి బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ వైఎస్ఆర్సిపి ఐటీవింగ్ ప్రెసిడెంట్ సునీల్‌రెడ్డిలు పాల్గొన్నారు. టెంపుల్ బస్టాప్ వద్ద ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి, వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి వారిక నివాళులు అర్పించారు. అనంతరం భారీ బైక్ ర్యాలీగా కమ్యూనిటీ హాల్‌కి వచ్చారు. ఈ సమావేశానికి యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సమావేశానికి యువత పెద్ద ఎత్తు పాల్గొన్నారు.

## రెండవ రోజు ఏఐఎఫ్ఈఈ సమావేశం



జీటీఎస్ ఆడిటోరియంలో జరిగిన ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 16వ జాతీయ సదస్సు ముగింపులో పాల్గొన్న ప్రతినిధులు

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్(ఏఐఎఫ్ఈఈ) 16వ జాతీయ సదస్సు 2 రోజులపాటు జీటీఎస్ కాలనీలో నిర్వహించారు. ఆదివారం 2వ రోజు టీఎస్ జెన్కో ఆడిటోరి యంలో జరిగిన సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన ప్రతినిధులతో మాట్లాడించిన అనంతరం విద్యుత్ రంగ ప్రైవేటీకరణను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ బిల్లును 2022ని రద్దు చేయాలని లేకుంటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంతటి ఉద్యమాలకైనా వెనకాడబోమని హెచ్చరిస్తూ తీర్మాణం చేశారు. తీర్మాణంతో పాటు ఉద్యోగుల సంక్షేమం సంస్థ సమాన పనికి సమాన వేతనం తదితర మరిన్ని తీర్మానాలు చేయటం జరిగింది.

## కాంగ్రెస్ పాలనను చూసి బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారు: కోట నీలిమ



మైనార్టీలను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకుంటున్న కోట నీలిమ

బేగంపేట్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్తః కాంగ్రెస్ ప్రవేశపెట్టిన జనరంజకమైన బడ్జెట్‌ను చూసి బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని టీపీసీసీ ప్రధానకార్యాదర్శి కోట నీలిమ అన్నారు. 10 సంవత్స రాలలో బీఆర్ఎస్ చేయలేని పనులను 10 వారాల్లోనే తాము పూర్తి చేసినట్లు ఆమే పేర్కొన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని బేగంపేట్ డివిజన్‌లో కోట నీలిమ సమక్షంలో మైనారిటీలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యాక్రమంలో షేక్ అక్బర్ పాషా, అబ్దుల్, మోయిజ్, సయ్యద్ అహ్మద్, శేఖర్ పాల్గొన్నారు.

## భారీగా పెరిగిన చికెన్ ధరలు

మొదటి పేజీ తరువాయి..

తాజాగా మళ్లీ అమ్మకాలు పుంజుకోవడంతో ధరలు కూడా పెంచేశారు. గత వారం రోజుల క్రితం చికెన్ ధర కిలో రూ.200–220లు పలికింది. దీంతో చాలా మంది సామాన్య ప్రజలు చికెన్ కొనుగోలుకు మొగ్గుచూపారు. కానీ మళ్లీ చికెన్ ధరలు పెరుగుతున్నాయి.అదీ పెరు గుతూ ఆదివారం రూ.260లకు చేరింది. ప్రస్తుత పరిస్థి తుల్లో చికెన్ ధరలు పెరగడం సామా న్యులకు భారంగానే మారింది.



యాకుత్‌పుర నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎంపి అసదుద్దీన్ ఓవైసీ

## భారతీయ సంప్రదాయ కళలో కూచిపూడి నృత్యానికి ప్రత్యేక స్థానం

**యక్షగాన నృత్య గంధర్వ శిరోమణి డాక్టర్ యేలేశ్వరపు చలపతిశాస్త్రి**



సంగీత, నృత్య కళాకారులను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: భారతీయ సంప్రదాయ కళలో కూచిపూడి నృత్యానికి ప్రత్యేక స్థానముందని కూచిపూడి సాంప్రదాయ నాట్యాచార్యులు, యక్షగాన నృత్య గంధర్వ శిరోమణి డాక్టర్ యేలేశ్వరపు చలపతిశాస్త్రి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంతో శివశక్తి ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపకులు, అంతర్జాతీయ రికార్డులగ్రహీత జిఎస్.వాసు ఆధ్వర్యంలో అంతారామమయం–2024 సంగీత నృత్యోత్సవ వైభవం జరిగింది. ఉత్సవాలను ప్రారంభించిన అనంతరం డాక్టర్ యేలేశ్వరపు చలపతిశాస్త్రి మాట్లాడుతూ తెలుగు వారి మణిమయ కిరీటం కూచిపూడి అని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్తమాన కళాకారులచే సంగీత, నృత్య కార్యక్రమాలు అందరిని అలరించాయి. సంగీత, నృత్యగురువులు విక్కిరాల జ్యోత్స్న(కూచిపూడి), వురుపుటూరు శ్రీనివాస ప్రత్యూష (సంగీతం), సంస్థ వ్యవస్థాపకులు, కూచిపూడి నృత్యగురువు జిఎస్.వాసు శిష్య బృందంచే నృత్య కార్యక్రమాలు అద్భుతంగా సాగాయి. సంగీత, నృత్యకళాకారులను ఈ సందర్భంగా అతిథులు ఘనంగా సత్కరించి అభినందించారు.

## సర్కారు బడుల్లో విద్యార్థుల ఇబ్బందులు: కిషన్‌రెడ్డి



పవర్‌బోర్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

కంటోన్మెంట్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: సర్కారు బడుల్లో టాయిలెట్లు, తాగేందుకు మంచినీళ్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం విద్యకు నిధుల కేటాయింపు తగ్గిస్తే ఎలా అని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం నిధులు ఇచ్చినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించిందని ఆయన గుర్తు చేశారు. ఆదివారం మోండామార్కెట్, రాం గోపాల్‌పేట్‌లతో పాటు పలు డివిజన్‌లలో ఎంపీ ల్యాడ్స్‌తో ఏర్పాటు చేసిన పవర్ బోర్ల ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తెలంగాణ ఎడ్యుకేషన్ బడ్జె ట్ తగ్గుముఖం పడుతున్నదని, కనీస వసతులు లేకప విద్యార్థులు ఇబ్బంది పడుతు న్నారన్నారు. మిడ్ డే మీల్స్‌కు, విద్యార్థులకు యూనిఫామ్‌కు, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులు సరిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో వైద్య ఆరోగ్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వాకర్స్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.వివేక్, బి.వెంకటస్వామిగౌడ్

**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my client Tipi Surender Reddy S/o Tipi Mukunda Reddy, Aged about 62 years. R/o H.No.11-15-201/1, J.B.Colony, Near Doctors Colony, Saroornagar, Hyderabad - 500035, Cell : 9440865333 had lost his original property link document bearing No.826 of 1999, dated 25-2-1999 pertaining to the Plot No.12, admeasuring 200 square yards or 167.23 square meters in Survey No.524, situated at Pedda Amberpet Village, presently Abdullapurmet Mandal, (earlier Hayathnagar Mandal), Ranga Reddy District, bounded by North 20 feet wide, South Plot No.25, East Plot No.13, west Plot No.11 which belongs to vendor, while shifting our house at Masjid Lane, L.B.Nagar on 20-12-2023.

If any person/s finds the said property link document bearing No.826 of 1999, dated 25-2-1999 the same may be handed over to the undersigned as a law abiding citizen. Further the above said original document shall not be abused or mis-used or otherwise utilized by unauthorized person. If any unauthorized person makes misuse of it, the same shall not bind my client.

Hence, this public notice.

**E. MAHENDER REDDY**
Advocate.
Plot No.28, Vardha Nagar Colony, Bagh Hayathnagar, Hayathnagar, R.R District
Cell 9848984286.

**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-I HYDERABAD, TRIVENI COMPLEX, 3rd FLOOR, ABIDS, HYDERABAD**
**O. A. No. 196 OF 2023**

**Between:**
Bank of Baroda Himayatnagar Branch, (Erstwhile Dena Bank) Rep. by its Chief Manager
**... APPLICANT**
**AND**
M/s.Hanuman Steel Traders, Represented by its Prop: Mr.Nimmala Ravikanth And 2 others
**... DEFENDANTS**

**SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEF PRAYED SHOULD NOT BE GRANTED**

To,
Mr.Nimmala Ravikanth Aged about 30 years, Occ:Employee R/o H.No.1-1-5/6, Satsung Colony Upparpally, Rajendra nagar Hyderabad-500 048-Telangana.

Whereas, the applicant has instituted the above application under Section 19 of the Recovery of Debts due to Banks and Financial Insitutuions Act, 1993 against the above referred Defendants for the recovery of a sum of Rs.47,22,125/- (Rupees Forty Seven Lakhs Twenty Two Thousand One Hundred and Twenty Five Only) together with current and future interest, costs and for other reliefs.

The above mentioned Defendants are therefore hereby directed to appear before this Tribunal in person or through an Advocate or duly authroised agent in support of your defense to show cause on 11.03.2024 at 10.30 AM as to why the reliefs prayed for should not be granted. Take notice that in case of default the application will be heard and determined in your absence.

**GIVEN UNDER MY HAND AND SEAL OF THIS TRIBUNAL ON THIS THE 08th DAY OF February, 2024**
**Sd/- Registrar, Debts Recovery Tribunal-I Third Floor, Triveni Complex, Abids, Hyderabad.**

**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, TRIVENI COMPLEX, FIRST FLOOR, ABIDS, HYDERABAD**
**O.A No. 778 of 2023**

**Between:**
M/s Bank of Baroda,
West Maredpally Branch
Rep. by its Branch Manager
**...APPLICANT**
**AND**
M/s.Prime Agencies and others
**...DEFENDANTS**

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

To
1. M/s.Prime Agencies (Sole Proprietary Firm) Rep.by its Proprietor Mrs.UshaKankaria, W/o Ashok Kumar Kanakaria, Aged about 65 years, 35 Smart Colony, West Maredpally, Secunderabad 26.
2. Mrs.UshaKankariaW/o Ashok Kumar Kanakaria, Aged about 65 years, Occ:Business, Proprietor M/s.Prime Agencies, R/o H.No.1-8-505, Flat No.504, Sai SagarHights, Praksh Nagar, Hyderabad-500 016
3. Mr.Ashok Kumar Kanakaria, S/oLate SubhkaranKanakaria, Aged Major, Occ:Business, R/o H.No.1-8-505, Flat No.504, Sai SagarHights, Praksh Nagar, Hyderabad-500 016
4. Mr.SiddarthKanakaria, S/oMr.Ashok Kumar Kanakaria, Aged Major, Occ:Business, R/o H.No.1-8-505, Flat No.504, Sai SagarHights, Praksh Nagar, Hyderabad-500 016.
**...DEFENDANTS**

Please take summon in the above OA No. 778 of 2023 filed by M/s BANK OF BARODA before the DRT-II, Hyderabad for recovery of Rs.46,33,818.49ps (Rupees Forty Six Lakhs Thirty Three Thousand Eight Hundred Eighteen and paise Forty Nine Only) against the Defendants. The Hon'ble Tribunal ordered summons to the Defendants by way of paper publication in "VARTHA" Telugu Daily newspaper and posted the same on 03.04.2024.

In accordance with Sub-Section 4 of Section 19 of the Act, you the Defendants are directed as under:
i) To show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted.
ii) To disclose particulars of assets other than properties and assets specified by Applicant under serial number 3A of the Original Application.
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the Original Application, pending hearing and disposal of the application for attachment of properties.
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in ordinary course of his business, any other assets over which security interest is created and/or other assets and properties specified by applicant under serial number 3A of the Original Application without the prior approval of the Tribunal.
v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with Bank or Financial Institutions holding security interest over such assets.

You are hereby required to show cause on 03.04.2024 at 10:30 Am at Debts Recovery Tribunal-II Hyderabad, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.

Take Notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and seal of the Tribunal on this day of the 9th day of February, 2024.

**// By Order of the Tribunal//**
**REGISTRAR**
**Debt Recovery Tribunal-II**
**Hyderabad.**

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే బలాల



ఉచిత కరెంట్ పథకం కౌంటర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే బలాల తదితరులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్ పల్టాన్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కరెంట్ పథకం కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత కరెంట్‌తో పేదలకు ఎంతో లబ్ది చేకూరుతుందన్నారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మినాజుద్దీన్, పలువురు లబ్దిదారులు పాల్గొన్నారు.

## నేషనల్ గ్రీన్ క్రాప్ పోటీల్లో సత్తా చాటిన సిల్వర్ డ్రాప్స్ విద్యార్థులు



బహుమతి అందుకుంటున్న సిల్వర్ డ్రాప్స్ విద్యార్థిని

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** నేషనల్ గ్రీన్ క్రాప్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా స్థాయిలో ఆల్టర్‌నేట్ ఆఫ్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనే అంశంలో జరిగిన పోటీలో అద్భుతమైన మోనో యాక్షన్ ప్రదర్శన చేసిన జిల్లెలగూడ సిల్వర్ డ్రాప్స్ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు లభించాయి. నగరంలో జరిగిన ఈ పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని భావికకు మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి 6వ తరగతి విద్యార్థిని యతికకు దక్కాయి. ఈ మేరకు నిర్వాహకులు వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సిల్వర్ డ్రాప్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ జె.శ్రీనివాసరావు విజేతలైన విద్యార్థులను, గైడ్ టీచర్లను, ప్రిన్సిపాల్‌ను అభినందించారు.

## పెండింగ్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు : కార్పొరేటర్ బండారు శ్రీవాణి

**ఉప్పల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** రామంతాపూర్ కామాక్షిపురంలో ఆదివారం స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కాలనీలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డ్రైనేజీ సమస్య తక్షణ పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహించే వారిపై తగు చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కాలనీలో మౌళిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దుర్గేష్, ప్రధాన కార్యదర్శి ఉలుగొండ నారాయణదాసు, రవి, కల్మకల్ల లింగం, లక్ష్మణ్, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ గీత

**ఉప్పల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మీర్‌పేట్, కల్యాణపురి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన వైద్య శిబిరాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ముఖ్య అతిధులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు లయన్స్‌క్లబ్ ముందుకు రావడం హర్షనీయమన్నారు. పేదల కోసం పాటుపడే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. సామాజిక సేవలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ముందుంటారని, కరోనా సమయంలో కూడా ఎంతో సేవలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా కంటి వైద్య పరీక్షలతోపాటు, దంత పరీక్షలు, జనరల్ హెల్త్, ఇసిజి, డయాబెటిక్, కోలాస్ట్రాల్ తదితర చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎస్‌రెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులతోపాటు, అపోలో, సన్‌షైన్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ హరీష్‌రెడ్డి, వైస్ జిల్లా గవర్నర్లు వి.కృష్ణప్రసాద్, కె.ఇన్నారెడ్డి, లయన్ సభ్యులు డా.లక్ష్మీమూర్తి, మంద సురేష్‌కుమార్, కల్లెం కృష్ణారెడ్డి, నాగన్న, విజయభాస్కర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు వికాస్, సత్యనారాయణ, శంకర్, శివరాంరాజు, శంకర్, మల్లికార్జున్, శ్యామ్ ప్రసాద్, మహిపాల్‌రెడ్డి, బిఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, పల్లె నర్సింగ్‌రావు, కొండల్‌రెడ్డి, గడ్డం పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సబితారెడ్డితోనే అభివృద్ధి సాధ్యమైంది: కార్పొరేటర్ తీగల మాధవి



పాత గ్రామం ప్రధాన రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మాధవి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 24వ డివిజన్‌లోని ప్రాంతాల అభివృద్ధి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితోనే సాధ్యమైందని కార్పొరేటర్ తీగల మాధవి సాయినాథ్ రెడ్డి అన్నారు. సబితారెడ్డి సహకారంతో మంజూరైన రూ.50 లక్షల నిధులతో చేపట్టిన మీర్‌పేట్ పాత గ్రామం ప్రధాన రోడ్డు పనులకు ఆదివారం ఆమె శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గుంతలమయంగా మారి ఉన్న పాత గ్రామం బురుజు నుండి ప్రధాన చౌరస్తా వరకు ఉన్న రోడ్డును నిర్మించాలని విజ్ఞప్తి చేసిన వెంటనే స్పందించిన సబితారెడ్డి నిధులు మంజూరు చేశారని వెల్లడించారు. ఈ మేరకు ఆమెకు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, గ్రామ నాయకులు కీసర సుధాకర్‌రెడ్డి, కీసర మిన్నారెడ్డి, తీగల రాజిరెడ్డి, పెండ్యాల శ్రీనివాస్, పల్లె దీప గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

**ఉప్పల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రమణిసిద్ది ఆధ్వర్యలో నెల నెల కళారాధన కార్యక్రమంలో భాగంగా లక్ష్మిరామ శిష్య బృందం ఆధ్వర్యంలో కర్నాటక గాత్ర కచేరీ, అన్నమాచార్య, రామదాసు, మీరాబాయి. పురందర దాసు, తులసిదాసు, సంకీర్తనలను అక్షర, అధ్య, శ్రావ్య, మౌక్తిక తదితరులు ప్రదర్శించారు. మనోజ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనలో భాగంగా ఆనంద నర్తన, భజమానస, మూషిక వాహన, ముద్దుగారే యశోధ, అదిగో, అల్లదిగో, కృష్ణ తరంగం, శివ తాండవం తదితర అంశాలను శాన్వి, భవ్య, గీత, ఇందు, సాహిత, మోక్ష, గోపిక తదితరులు ప్రదర్శించారు. సితార్ విద్వాన్ పాండురంగ, ముటాలిక్ ప్రిన్సిపల్ త్యాగరాజ గవర్నమెంట్ మ్యూజిక్ కళాశాల రమణిసిద్ది కళాకారులను సత్కరించారు. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకులనుంచి మంచి స్పందన ఉందని తెలిపారు.

## నడకతో చక్కటి ఆరోగ్యం : భాగ్యలక్ష్మి



కార్పొరేటర్ భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** నడకతో చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని శాలివాహననగర్ వాకర్స్ అసోసియేషన్ 14వ సంస్థాపన వేడుకలలో ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ఈ సంవత్సరం ఉత్తమ అధ్యక్షుడి అవార్డు శాలివాహననగర్ అసోసియేషన్‌కు రావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, సంస్థాపన అధికారి శ్రీనివాసచారి, ప్రసాద్, చక్రపాణి, ప్రకాష్, దినేష్, సందీప్, వెంకట్‌రెడ్డి, పున్‌రెడ్డి కృష్ణారెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్దే లక్ష్యం : జయేందర్‌రెడ్డి



నూతనంగా ఏర్పడిన న్యూ సుభాష్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం

**తుర్కయంజాల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ న్యూ సుభాష్ నగర్ కాలనీ నూతన సంక్షేమ సంఘం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా కందాల జయేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.కృష్ణారెడ్డి, జి.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా పి.వెంకన్న, కోశాధికారిగా ఎస్.రాఘవేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జయేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ సంక్షేమం కోసం నూతన కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగు నీరు సహా ఇతర మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పని చేస్తామన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపట్ల సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## పార్కును పరిశుభ్రంగా ఉంచాలి : పవన్



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** పార్కులో పరిశుభ్రంగా ఉంచే విధంగా పారిశుద్ధ విభాగం సిబ్బంది చొరవ తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ నాగేశ్వర్‌రావు కాలనీ తెలంగాణ పార్క్‌లో కాలనీ వాసులతో కలిసి ఆదివారం కార్పొరేటర్ పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్క్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిలించారు. పార్క్ వాకింగ్‌ట్రాక్ మీద చెత్త శుభ్రం చేయడం లేదని, వాకింగ్ చేసేటప్పుడు ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే సానిటైజేషన్ సూపర్‌వైజర్ చిరంజీవినీ పిలిపించి పార్కులో ప్రతిరోజు శుభ్రంగా ఉండేలా చూడాలని, పార్కులో వ్యర్థ పదార్థాలను తొలగించాలన్నారు. విద్యుత్ దీపాల సమస్యను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌భాస్కర్, రాకేష్ యాదవ్, లక్ష్మిరాజం, నారాయణ, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పేలిన ఫ్రిడ్జ్, సిలిండర్

**అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో ఫ్రిడ్జ్ సిలిండర్ పేలిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు బాధితులు వివరాల ప్రకారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనున్న రెండవ అంతస్తు భవనంలో మొదటి అంతస్తులో నివసిస్తున్న విజయలక్ష్మి ఇంట్లో ఆదివారం మధ్యాహ్నం ఎవరు లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కి గురై ఫ్రిడ్జ్ ఇంట్లోని సిలిండర్‌పేలి తీవ్రంగా మంటలు వ్యాపించారు. సంఘటనను గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో స్థానికంగా ఉన్న ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపులోకి తెచ్చింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. ఇంట్లోని సామాగ్రి అంతా కాలి బూడిదయినట్లు తెలిపారు. సంఘటన సంబంధించిన విషయాలను స్థానిక నాయకులు ఎంఆర్ఓ దృష్టికి తీసుకెళ్లగా తక్షణ సహాయం కింద ఐదు వేల రూపాయల నగదును బాధితురాలు విజయలక్ష్మికి అందజేశారు.



ఫ్రిడ్జ్, సిలిండర్ పేలడంతో ఇంటినుండి మంటలు వస్తున్న దృశ్యం

## దావూద్‌ఖాన్‌గూడ భూ బాధితులకు న్యాయం జరిపిస్తా : కెఎల్‌ఆర్



బడంగ్‌పేట్‌లో భూబాధితులతో మాట్లాడుతున్న కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 2 దావూద్‌ఖాన్‌గూడ భూ బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం తరపున న్యాయం చేయిస్తానని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హామీనిచ్చారు. ఆదివారం ఆయన బడంగ్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయకులు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర జైహింద్, పెద్దబావి సమర సింహారెడ్డి, గట్టు బాలకృష్ణ, బాల్‌నింగని జంగయ్య, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, యువ నాయకులు సామ వరుణ్‌రెడ్డి, పెద్దబావి నాగనందీశ్వర్‌రెడ్డి తదితరులతో కలిసి దావూద్‌ఖాన్‌గూడలోని ప్రభుత్వ భూమిని పరిశీలించి బాధిత దళిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా దళితులు తమకు జరిగిన అన్యాయం విషయాన్ని కెఎల్‌ఆర్‌కు వివరించారు. ఈ మేరకు స్పందించిన కెఎల్‌ఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చింది ప్రజా ప్రభుత్వమనీ ఇక్కడి దళిత కుటుంబాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి న్యాయం జరిపిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో భూబాధితులు కర్రె రమేష్, గుడ్ల శ్రీనివాస్, రొడ్డ యాదయ్య, సత్తయ్య, గుడ్ల రాములు, కర్రె ముత్యాలు, గుడ్ల మహేందర్, బిక్షపమ్మ, అండాలు తదితరులు పాల్గొన్నారు.

## పీవీకి భారతరత్న ప్రకటించడం హర్షనీయం



అభినందన కార్యక్రమంలో పాల్గొన్న పరిమళ సాహితి సభ్యులు

**హయత్‌నగర్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు బహుభాషావేత్తయే కాకుండా ఉత్తమ సాహిత్య కారుడని పరిమళ సాహితీ హైదరాబాద్ అధ్యక్షుడు డా.మండల స్వామి అన్నారు. పీవీకి భారత రత్న ప్రకటించిన సందర్భంగా హయత్‌నగర్‌లోని భవిష్య జూనియర్ కళాశాలలో ఆదివారం సాయంత్రం ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పీవీ సంస్కరణ దృక్పదంతో రచనలు చేశారని కొనియాడారు. గొల్లరామవ్వ వంటి కథ నుంచి మొదలుకుని లోపలిమనిషి, వేయి పడగలు వరకు తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఎన్నో రచనలు చేశారన్నారు. వేయి పడగలు తెలుగు నవలను సహస్రఫణ్ పేరుతో హిందీలోకి అనువాదం చేసిన ఘనత ఆయనకే దుక్కుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన పరిమళ సాహితీ ప్రధాన కార్యదర్శి నకిరేకంటి శ్రీనయ్య మాట్లాడుతూ పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణల అభిలాషిగా, రాజకీయ చాణిక్యుడిగా నిలిచిన స్థితప్రజ్ఞుడన్నారు. అంతటి మహనీయుడికి కేంద్రం భారత రత్న ప్రకటించడంపట్ల పరిమళ సాహితి సభ్యులు డా.పున్న దామోదర్, చెట్టిగణేష్‌గౌడ్, జానయ్య, స్వామి, రవి, శేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

## మల్లాపూర్ ప్రధాన సమస్యలను పరిష్కరించా : కార్పొరేటర్ పన్నాల



కార్పోరేటర్ పన్నాలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**నాచారం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** మల్లాపూర్ డివిజన్ కార్పోరేటర్‌గా రెండవసారి ఎన్నికై మూడు సంవత్సరాల పదవి కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా మల్లాపూర్ వార్డు కార్యాలయంలో ఆదివారం కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డిని నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంక్షేమ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పన్నాలను శాలువాతో ఘనంగా సన్మానించారు. నిత్యం ప్రజల్లో ఉండి వారి సమస్యల కోసం తపన పడే నాయకుడు పన్నాల దేవేందర్‌రెడ్డి అని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు స్వీట్లు తినిపించి అభినందించారు. అనంతరం పన్నాల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ మరో రెండేళ్లలో డివిజన్‌లో అన్ని సమస్యలను పరిష్కరించి ఆదర్శడివిజన్‌గా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఎనిమిది సంవత్సరాలు సహాయ సహకారాలు అందించిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దయాకర్ రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెడికల్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ సమస్యల పరిష్కారానికి కృషి : చల్లా వంశీచంద్‌రెడ్డి



వంశీచంద్‌రెడ్డిని కలిసిన మెడికల్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ సభ్యులు

**వనస్థలిపురం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్.శాంతికుమార్‌గౌడ్, జనరల్ సెక్రెటరీ నూకం బిక్షపతి, వర్కింగ్‌ప్రెసిడెంట్ ఎండి రఫీయుద్దీన్, ఉస్మానియా, గాంధీ, వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి చెందిన వివిధ రాష్ట్ర కార్యవర్గ సభ్యులతోపాటు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వివిధ నియోజకవర్గాల కార్యవర్గ సభ్యులందరూ, యూత్ కాంగ్రెస్ సీనియర్‌నాయకులు సూదిని రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పాలమూరు న్యాయ యాత్ర సందర్భంగా ఏఐసీసీ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ చల్లా వంశీచందర్‌రెడ్డిని కొత్తూరు ప్రాంతంలో కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వంశీచందర్‌రెడ్డి స్పందించి సమస్యలను విని వీలైనంత త్వరలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. అనంతరం ట్రేడ్ యూనియన్ తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, ఉస్మానియా, గాంధీ, తాండూర్, వనస్థలిపురం ఆసుపత్రుల కమిటీల సభ్యులు మహేందర్, మధుకర్, వెంకట్ రాథోడ్, ముఖేష్, రఘురాజు, దిలీప్, చంచల, రాజేష్, రోహిత్, టీఎన్‌జీఓస్ నాయకులు నరేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడలలో రాణించాలి : ఈటెల



ముగింపు వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఈటల రాజేందర్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతోపాటు, అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి రామంతాపూర్ పాలిటెక్నిక్ మైదానంలో సత్యసాయి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఐదవ ఆగమ్మ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు, క్రీడల పట్ల ఎంతో అసక్తి ఉండాలని, క్రీడాకారులకు తగు సహకారం అందిస్తామన్నారు. గత 20 సంవత్సరాలుగా ఉత్తమ విద్యాసంస్థలుగా ఎదిగిన సత్యసాయి స్కూల్స్‌కు తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు. స్కూల్ చైర్మన్ గడ్డం సాయికిరణ్ మాట్లాడుతూ విద్యార్థులను ఎన్నో ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు పాఠశాల ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని, తెలంగాణలో ఎక్కడ క్రీడలు జరిగినా తమ పాఠశాల విద్యార్థులకు మొదటి స్థానం సాదిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కబడ్డీ క్రీడలు ఆడి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధులు ఎస్ఎన్‌రెడ్డి, ట్రస్మా అధ్యక్షులు ఉపేందర్, రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మూడోసారి మోడీని గెలిపించాలి : చింతల



దీన్‌దయాల్ చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న సురేంద్రనాథ్‌యాదవ్

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** దేశాన్ని అన్ని రంగాలలో అభ్యున్నతి దిశగా తీసుకువెళ్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీని మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి చింతల సురేంద్ర నాథ్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బిజెపి కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 56వ బలిదాన్ దివస్ సందర్భంగా దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాల వేసి సురేంద్రనాథ్‌యాదవ్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ నేషన్ ఫస్ట్ అనే సూత్రానికి కట్టుబడి, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ ప్రచారం చేశారని తెలిపారు. ఆయనకు రాజకీయం అంటే ప్రజలకు సేవ చేసే సాధనం. రాజకీయ నాయకులు అధికారం, పదవులు, డబ్బు కోసం తహతహలాడకూడదని, భావజాలానికి, స్వచ్ఛమైన జీవితానికి కట్టుబడి ఉంటూ జనతా జనార్ధన్‌కు సాధ్యమైనంత ఉత్తమంగా సేవ చేయాలని ఆయన అభిప్రాయపడ్డారని అన్నారు. ఈ దృక్పథంతో ఆయన వేలాది మందిని రాజకీయాల్లోకి వచ్చేలా ప్రేరేపించారన్నారు. కేంద్ర ప్రభుత్వ దీన్ దయాళ్ అంత్యోదయ యోజన అనేది నైపుణ్యాభివృద్ధి, ఇతర మార్గాల ద్వారా జీవనోపాధి అవకాశాలను పెంపొందించడం ద్వారా పట్టణ, గ్రామీణ పేదలను ఉద్ధరించడానికి ఉద్దేశించిన ఒక విస్తృతమైన పథకం అన్నారు. అనంతరం గావ్‌చలో బస్తిచలో కార్యక్రమంలో భాగంగా గడపగడపకు ప్రచారం నిర్వహించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని అఖండ మెజార్టీతో గెలిపించి మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోడీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బద్దం బాలకృష్ణగౌడ్, కొండబత్తుల శ్రీనివాస్, లయకాలంశెట్టి, కేశిరెడ్డి పద్మరెడ్డి, రామ్‌దయాకర్ రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, మనోజ్‌కుమార్, రాజాచారి, శివకుమార్ పాల్గొన్నారు.

## వైభవంగా బాలయేసు మహోత్సవాలు



భక్తులకు సందేశమిస్తున్న కార్డినల్ పూల అంథోని తదితరులు

**తుర్కయంజాల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడలోని అద్భుత బాల యేసు పుణ్యక్షేత్రం వార్షిక మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం సికింద్రాబాద్ బోయిగూడ నుంచి బాలయేసు తేరు ప్రదక్షిణ మొదలైంది. అనంతరం చర్చ్‌లో ప్రార్ధనలు జరిగాయి. బాలయేసు మహోత్సవం దివ్య బలిపూజలో హైదరాబాద్ అతి మేత్రాణులు పూల ఆంథోని భక్తులకు తన సందేశాన్నిచ్చారు. శాంతి, ప్రేమ సమాజానికి అవసరమని బాలయేసు దీవెనలతోనే అవి సాధ్యమని వివరించారు. దివ్య బలిపూజ తర్వాత పతాకం దించడంతో ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో యంజాల విచారణ గురువు, పాస్టర్ ఉడుముల జె.చిన్నప రెడ్డి, పాస్టర్ పి.ఆల్బర్ట్, కౌన్సిలర్లు కొశికే ఐలయ్య, కాకుమాను సునీల్, నారని కవిత శేఖర్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యులు కాకుమాను మరియమ్మ చిన్నయ్య, బీఆర్ఎస్ నేత పోలిశెట్టి ప్రేమ్‌కుమార్, ఆరోగ్యరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లంబాడి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కాట్రావత్ రాజునాయక్

**తుర్కయంజాల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ ఇంద్రమ్మకాలనీకి సంబంధించిన కాట్రావత్ రాజునాయక్‌ను తెలంగాణ రాష్ట్ర లంబాడి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా లంబాడి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొర్ర లక్‌పతినాయక్ నియమించారు. ఈ సందర్భంగా రాజునాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న బంజారాల సమస్యలపై ఎల్లప్పుడూ నిరంతరం పోరాటాలు చేస్తానని అన్నారు. తనను కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

## ఉచిత శిబిరాలను సద్వినియోగపర్చుకోవాలి



వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** దిల్‌సుక్‌నగర్‌లోని శ్రేష్టశ్రీ కమల ఆసుపత్రి మొదటి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థో, ఫిజియోథెరఫీ, డెంటల్, కాస్మోటాలజీ విభాగాలలో ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించడంతోపాటు బిఎండి, దంత స్కేలింగ్, ఎక్స్‌రే తదితర ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు, సంప్రదింపులు నిర్వహించారు. వైద్య శిబిరంలో సుమారు 200ల మందికి పరీక్షలు నిర్వహించారు. అధునాతన పద్దతిలో ఉత్తమ వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు కిరణ్, కిషోర్, రవి, ఆర్థిచందన, హెచ్ఓడి ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.